APTEL /26/A1193

నేటి

# శుభోదయం

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

GK MEDIA



కావలెను

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో పనిచేయుటకు

జిల్లాల వారీగా

స్టాఫ్ రిపోర్టర్స్, రిపోర్టర్స్ కావలెను

సంప్రదించవలసిన నెం:

9696571571

GK Media Broadcasting Network

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి : 1 సంచిక : 7 సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు పేజీలు : 8 మంగళవారం 24 ఫిబ్రవరి 2026 వెల : 05/-



## స్వర్ణాంధ్ర 2047 విజన్‌తో తలసరి ఆదాయం

# భారీగా పెంపు

అమరావతి, (ఫిబ్రవరి 23) : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో ఇవాళ (సోమవారం) సంక్షేమ బడ్జెట్ కేటాయింపులపై చర్చించారు. సామాజిక సమానత్వం అనే లక్ష్యం కోసం ఎన్డీయే కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని వ్యాఖ్యానించారు. రాజకీయంగా కూడా వెనకబడిన వర్గాలకు ప్రాధాన్యం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. సంక్షేమం విషయంలో సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ చేశామని ఉద్ఘాటించారు. ఆటో కార్మికులు, మత్స్యకారులు, చేనేతలకు కూడా మేలు చేశామని తెలిపారు. నిత్యావసర సరకులు కూడా సక్రమంగా అందించేలా సాంకేతికత సాయం తీసుకున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కోసం ఎక్కువ కేటాయింపులు చేశామని చెప్పుకొచ్చారు. బడ్జెట్ కేటాయింపులు అమలు చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని వివరించారు. స్వర్ణాంధ్ర - 2047 విజన్‌లో భాగంగా తలసరి ఆదాయం రూ.3 లక్షల నుంచి రూ.54 లక్షలకు పెంచడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భావితరాల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. అంగన్‌వాడీ నుంచి స్కూళ్లు, కాలేజీల వరకూ మంచి విద్య, వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. పేద వర్గాల ఆదాయం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించామని సీఎం చెప్పారు.

**పీ4 ద్వారా ఆర్థిక అసమానతల తొలగింపు..**

పీ4 ద్వారా ఆర్థిక అసమానతలు తొలగించటానికి చర్యలు తీసుకుంటున్నామని చంద్రబాబు తెలిపారు. 10 లక్షల బంగారు కుటుంబాలను లక్షమంది మార్గదర్శకులు దత్తత తీసుకున్నారని వివరించారు. 'నిరంతరం పర్యవేక్షిస్తేనే ఏ కార్యక్రమమైనా ఫలితాలనిస్తుంది. అట్టడుగున ఉన్న పేదవర్గాలనూ ఆదుకునేలా పీ4 ప్రణాళికలు ఉన్నాయి. పూటగడవని పేదవారిని ఎలా పైకి తీసుకురావాలో అందరూ ఆలోచించాలి. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్దేశించారు. ఈ లక్ష్యాన్ని సాధించాలంటే పేదరికం ఉండరాదు. 2024 ఎన్నికల్లో ఏకపక్షంగా కూటమికి 94 శాతం విజయం కట్టబెట్టారు. బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కమిషన్ వేశాం. స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే సమయానికి రిజర్వేషన్లు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

**ఆ ఘనత ఎన్డీఏదే..**

బీసీ జాబితాలోని కొన్ని వర్గాలను ఎస్సీ, ఎస్టీల్లో చేర్చాలనే డిమాండ్లను కూడా పరిశీలిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. 'ఎస్సీ వర్గీకరణ తెచ్చి.. ఆ దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానికి దక్కింది. గిరిజనుల కోసం తెచ్చిన జీఓఎంఎస్ నంబర్-3ని సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ విషయంపై ఏం చేయాలో గిరిజన సంఘాల నుంచి అభిప్రాయలు సేకరించి ముందుకెళ్తాం. మైనార్టీ వర్గాలకు కూటమి ప్రభుత్వం రక్షణ కల్పించింది' అని సీఎం చెప్పారు.

## సోనార్ బంగ్లా సాకారం.. బెంగాల్ ప్రజలకు ప్రధాని

# బహిరంగ లేఖ



న్యూఢిల్లీ, (ఫిబ్రవరి 23) : పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరుగనున్న వేళ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బెంగాల్ ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితిపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరి కొద్ది నెలరోజుల్లో బెంగాల్ భవితను నిర్ణయించే కీలక ఎన్నికలు జరుగనున్నాయని, భావితరాల భవిష్యత్తును నిర్ణయించే ఈ ఎన్నికల్లో ప్రజలు వివేకవంతమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. బంగారు బంగ్లా కలల సాకారానికి తాను భరోసా ఇస్తున్నానని

మిగతా 2లో...

## కల్తీపాల బాధ్యులను

# వదిలేది లేదు



2లో

అమరావతి, (ఫిబ్రవరి 23) : రాజమండ్రి కల్తీ పాల ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు స్పందించారు. కల్తీ పాల ఘటన బాధాకరమన్నారు. ఈ ఘటనలో నలుగురు చనిపోగా.. ఇద్దరు వెంటిలేటర్‌పై ఉన్నారని ఆయన తెలిపారు. మరో 8 మందికి చికిత్స



# తేజస్ 'క్రాష్' కాలేదు, చిన్న సాంకేతిక సమస్యే

2లో

## హెచ్ఏఎల్ స్పష్టత

- తేజస్ జెట్ క్రాష్ అయిందన్న వార్తలను ఖండించిన హెచ్ఏఎల్

# రాహుల్ తప్పుకోవాలి

## మణిశంకర్ అయ్యర్ సంచలన వ్యాఖ్యలు

కోల్‌కతా, (ఫిబ్రవరి 23) : కాంగ్రెస్ వెటరన్ నేత మణిశంకర్ అయ్యర్ మరోసారి సొంత పార్టీపై విమర్శల దాడి చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వాన్ని ప్రశ్నించారు. 'ఇండియా' కూటమి సారథ్య బాధ్యతల నుంచి రాహుల్‌గాంధీ తప్పుకోవాలని, ఆ బాధ్యతలను ప్రాంతీయ పార్టీల నేతలకు అప్పగించాలని కోల్‌కతాలో మీడియాతో మాట్లాడుతూ ఆయన సూచించారు.







2లో

## ఖైదీలకు

# క్షమాభిక్షపై

## ప్రభుత్వం సానుకూలం



అమరావతి, (ఫిబ్రవరి 23) : జైలులోని ఖైదీలకు క్షమాభిక్ష విషయంలో కూటమి

(మిగతా 2వ పేజీలో)

# కల్తీ పాల ఘటన

## ఉన్నతాధికారులతో మాట్లాడిన ఆరోగ్యశాఖ మంత్రి



తూర్పుగోదావరి, (ఫిబ్రవరి 23) : రాజమహేంద్రవరంలో చోటుచేసుకున్న కల్తీ పాల ఘటనపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉన్నతాధికారులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పాలు, నూనెలు, ఇతర వాటి సేకరణ ఎంతవరకు జరిగింది? ఫలితాలు ఎలా ఉన్నాయి? అని అడిగి తెలుసుకున్నారు. నమూనాల సేకరణ, ఫలితాల పరిస్థితి ఏమిటి? అని అధికారులను ప్రశ్నించారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న కల్తీ పాల బాధితులకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. వ్యాపారి నుంచి సేకరించిన పాలు, పాల ఉత్పత్తుల నమూనాలను ప్రయోగశాలలకు పంపించినట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఫలితాలొచ్చేందుకు 72 గంటల వరకు సమయం పడుతుందని తెలిపారు. ఆసుపత్రుల్లో ఉన్న వారి నుంచి కూడా రక్త నమూనాలు సేకరించి పరీక్షిస్తున్నట్లు చెప్పారు. ఆసుపత్రుల్లో ఉన్న బాధితుల నివాస పరిసర ప్రాంతాల వారి ఆరోగ్య వివరాలనూ సేకరిస్తున్నామన్నారు. కాగా.. మంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ అమరావతి నుంచి రాజమహేంద్రవరం బయల్దేరారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం) డైరెక్టర్ నీలకంఠారెడ్డి ఇప్పటికే రాజమహేంద్రవరం వెళ్లారు. పాల వినియోగంపై బాధిత కుటుంబాల వారి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్లతో నమూనాల సేకరణ, తదుపరి చర్యలపై సమీక్షించారు.

## ఓటమి భయంతో బీజేపీతో పొత్తు పెట్టుకోవాలని స్టాలిన్

# చూస్తున్నారు

- పరిస్థితులకు అనుగుణంగా మారిపోవడం ఆ పార్టీ నేతలకు అలవాటేనని ఎద్దేవా



మిగతా 2వ పేజీలో..



2లో

## ఢిల్లీలో బాంబు

# బెదిరింపులు..

## పోలీసుల భద్రత కట్టుదిట్టం

ఢిల్లీ, (ఫిబ్రవరి 23) : దేశ రాజధాని న్యూఢిల్లీలో ఇవాళ (సోమవారం) బాంబు బెదిరింపులు తీవ్ర కలకలం రేపాయి. చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఎర్రకోటతో పాటు ఢిల్లీ శాసనసభ, పలు పాఠశాలలకు బాంబు బెదిరింపు కాల్స్ రావడంతో భద్రతా సంస్థలు అప్రమత్తమయ్యాయి. ఈ సమాచారం అందుకున్న వెంటనే ఢిల్లీ పోలీసులు, బాంబు స్క్వాడ్, భద్రతా బలగాలు రంగంలోకి దిగి విస్తృతంగా తనిఖీలు నిర్వహించాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేడు ఉదయం కొన్ని అనుమానాస్పద కాల్స్ రావడంతో



# ఉగాదికి జాబ్ క్యాలెండర్..

## జాబితాలోనే డీఎస్సీ పోస్టులు!

అమరావతి, (ఫిబ్రవరి 23) : ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాల్లో భాగంగా 8వ రోజు ప్రశ్నోత్తరాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్రంలోని విద్యావ్యవస్థ, నిరుద్యోగుల

మిగతా 2లో...

## ఢిల్లీలో బాంబు బెదిరింపులు.. పోలీసుల భద్రత కట్టుదిట్టం

ఎర్రకోట, అసెంబ్లీ, పాఠశాలల వద్ద అత్యవసర భద్రతా చర్యలు చేపట్టారు. ఈ సంఘటనతో కాసేపు ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి.

ఎర్రకోట పరిసరాల్లో హైఅలర్ట్..

దేశానికి చారిత్రక, సాంస్కృతిక ప్రతీకగా నిలిచిన ఎర్రకోటకు బాంబు బెదిరింపు రావడం భద్రతా సంస్థలకు పెద్ద సవాల్‌గా మారింది. వెంటనే ఎర్రకోట పరిసర ప్రాంతాలను పోలీసులు పూర్తిగా కట్టుదిట్టం చేశారు. బాంబు స్క్వాడ్ బృందాలు, డాగ్ స్క్వాడ్ సాయంతో తనిఖీలు నిర్వహించారు. ప్రధాన ప్రవేశ ద్వారాలు, సందర్శకుల ప్రాంతాలు, భద్రతా సున్నిత ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎర్రకోటలో పనిచేస్తున్న సిబ్బంది, సందర్శకులను తాత్కాలికంగా బయటకు పంపించి పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహించినట్లు తెలుస్తోంది. తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు గుర్తించలేదని స్పష్టం చేశారు. దీంతో ఇది కేవలం ఫేక్ కాల్ అయ్యే అవకాశముందని అధికారులు అనుమానిస్తున్నారు.

ఢిల్లీ అసెంబ్లీ వద్ద భద్రత కట్టుదిట్టం..

ఢిల్లీ అసెంబ్లీకి కూడా బాంబు బెదిరింపు కాల్ రావడంతో అక్కడా భద్రతను పెంచారు అధికారులు. పరిసర ప్రాంతాలను పూర్తిగా మూసివేసి, భద్రతా సిబ్బంది తనిఖీలు చేపట్టారు. అసెంబ్లీ ప్రాంగణంలోని ప్రతి వాహనం, కార్యాలయ గదులు, పార్కింగ్ ప్రాంతాలను ప్రత్యేక పరికరాలతో తనిఖీ చేసినట్లు సమాచారం. అక్కడి సిబ్బందిని అప్రమత్తం చేసి, భద్రతా నిబంధనలు కచ్చితంగా అమలు చేశారు. అయితే ఈ తనిఖీల్లోనూ ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లేదా పేలుడు పదార్థాలు గుర్తించలేదని పోలీసులు వెల్లడించారు.

పాఠశాలలకు బాంబు బెదిరింపులు..

నేడు ఉదయం ఢిల్లీలోని పలు పాఠశాలలకు కూడా బాంబు బెదిరింపు కాల్స్ రావడం పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చింది. స్కూల్ యాజమాన్యాలు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు అక్కడికి చేరుకుని తనిఖీలు నిర్వహించారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా కొన్నిచోట్ల తరగతులను తాత్కాలికంగా నిలిపివేసినట్లు వార్తలు వచ్చాయి. కొన్నిచోట్ల విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొన్నప్పటికీ.. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. తనిఖీల అనంతరం స్కూల్ ప్రాంగణాల్లోనూ ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని అధికారులు ధ్రువీకరించారు.

ఫేక్ కాల్ కోణంలో దర్యాప్తు..

ఈ బాంబు బెదిరింపు కాల్స్ చేసిన వ్యక్తులను గుర్తించేందుకు సైబర్ క్రైమ్ విభాగం రంగంలోకి దిగింది. ఫోన్ నంబర్, లొకేషన్, కాల్స్ రికార్డులను పోలీసులు పరిశీలిస్తున్నారు. సాధారణంగా ఇలాంటి కాల్స్ ద్వారా ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం, భద్రతా వ్యవస్థను పరీక్షించడం వంటి ఉద్దేశాలు ఉండవచ్చని ఇంటెలిజెన్స్ అధికారులు చెబుతున్నారు. దర్యాప్తు పూర్తయ్యాక అసలు విషయం వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

## ఖైదీలకు క్షమాభిక్షపై ప్రభుత్వం సానుకూలం

ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. సోమవారం 8వ రోజు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమ య్యాయి. ఈ సందర్భంగా జైళ్లు, సంస్కరణల చట్టం సవరణపై బిల్లును అసెంబ్లీలో హోంమంత్రి అనిత ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ.. ఖైదీల సంస్కరణల కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కేంద్రం తెచ్చిన చట్టం మేరకు ఇక్కడ కూడా సంస్కరణలు అమలు చేస్తున్నామన్నారు. ఖైదీలు జైలులో ఉండి చదువుకునేలా అవకాశాలను మెరుగుపరుస్తున్నామని చెప్పారు.

ఖైదీల్లో పరివర్తన తీసుకురావటం కోసం చట్టంలో మార్పులు తీసుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా ఖైదీల పిల్లల కోసం జైలులో ప్రత్యేకంగా అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఖైదీల నేరచరిత్ర, ప్రవర్తన ఆధారంగా కేటగిరీలుగా విభజిస్తామని పేర్కొన్నారు. ఖైదీలు మారేందుకు, మానసిక పరివర్తన తెచ్చేలా ఓపెన్ ఎయిర్ జైళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఖైదీలు.. వ్యవసాయంతో పాటు ఇతర వృత్తులు నిర్వహించేలా చర్యలు చేపడతామన్నారు. ఇక ఈ బిల్లుపై చర్చలో పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జైళ్ల శాఖ ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ చట్టంలో ప్రస్తావన లేదన్నారు. జైళ్లలో ఖైదీల సంఖ్య పెరిగినా సౌకర్యాలు మాత్రం పెరగటం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. జైళ్ల శాఖలో 30 శాతం సిబ్బంది పోస్టులు ఖాళీగానే ఉన్నాయని వివరించారు. జైళ్లలో మహిళా సిబ్బంది కొరత చాలా ఎక్కువగా ఉందని గుర్తు చేశారు. అండర్ ట్రయల్ ఖైదీలు న్యాయ సహాయం లేకపోవడంతో జైళ్లలోనే ఉండిపోతున్నారని గుర్తు చేశారు. చిన్న చిన్న కేసుల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్న వారి సత్ ప్రవర్తన ఆధారంగా బయటకు పంపించాలన్నారు. ఖైదీలు జైలు నుంచి బయటకు వచ్చాక జనజీవన స్రవంతిలో కలిసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. వైసీపీ ప్రభుత్వంలో తాము సైతం జైలుకు వెళ్లాల్సి వచ్చిందని చెప్పారు. జీవిత ఖైదు పడిన ఖైదులు 60 ఏళ్లు వయసు దాటిన వారికి క్షమాబిక్ష ప్రసాదించాలంటూ ప్రభుత్వానికి సూచించారు. క్షమాబిక్ష కోసం జైళ్లలోని చాలామంది ఖైదీలు ఎదురు చూస్తున్నారన్నారు. ఆ తర్వాత జైళ్లు, సంస్కరణల చట్టం సవరణ బిల్లును శాసనసభ ఆమోదించింది.

## సోనార్ బంగ్లా సాకారం.. బెంగాల్ ప్రజలకు ప్రధాని బహిరంగ లేఖ

అన్నారు. 'జై మహాకాళి' అంటూ ప్రధాని తన లేఖను ప్రారంభించారు. 'మరి కొద్ది నెలల్లోనే బెంగాల్ భవిష్యత్తు నిర్ణయం కోబోతోంది. మీరు తీసుకునే తెలివైన నిర్ణయం పైనే భావితరాల భవిష్యత్తు, దిశానిర్దేశం ఆధారపడి ఉంటుంది. సోనార్ బంగ్లా కోసం యువకులు, పెద్దలు, మహిళలు కన్న కలలు కల్లలుగా మిగిలిపోతున్న పరిస్థితి ఇవాళ ఉంది. వారి బాధలు నన్ను కలిచివేస్తున్నాయి. ఇందుకోసం హృదయపూర్వకంగా ఒక తీర్మానం చేసుకున్నాను. వికసత్ బంగ్లా సాధనకు నిర్ణయం తీసుకున్నాను' అని ఆ లేఖలో మోదీ పేర్కొన్నారు. గత 11 ఏళ్లుగా దేశ ప్రజల ఆశీస్సుల బలంతో ప్రజాసంక్షేమానికి, దేశ సర్వతోముఖాభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం పాటుపడిందని, రైతుల సంక్షేమం నుంచి యవత కలల సాకారం, మహిళా సాధికారత వరకూ కృషి చేసిందని చెప్పారు. ప్రభుత్వ విధానాల వల్ల సాధించిన సానుకూల ఫలితాలను ఇవాళ ప్రజలు చూస్తున్నారని అన్నారు. బెంగాల్ అభివృద్ధి విషయంలో మమతాబెనర్జీ ప్రభుత్వం సహాయ నిరాకరణ చేస్తోందని మోదీ ఆ లేఖలో విమర్శించారు. అయినప్పటికీ ప్రజాసంక్షేమానికి కట్టుబడి కేంద్రం ముందుకు వెళ్తోందన్నారు. 'జన్-ధన్ యోజన'తో పశ్చిమబెంగాల్‌లోని సుమారు 5 లక్షల మందికి బ్యాంకు అకౌంట్లు తెరిచామని, స్వచ్ఛభారత్ అభియాన్ కింద 85 లక్షల టాయిలెట్లను రాష్ట్రంలో నిర్మించామని చెప్పారు. చిన్న వ్యాపారులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు రూ.2.82 లక్షల కోట్లు రుణాలిచ్చామని, 56 లక్షల మంది సీనియర్ సిటిజన్లకు అటల్ పెన్షన్ యోజన కింద లబ్ధి చేకూర్చామని, ఉజ్వల్ యోజన కింద కోటికి పైగా ఎల్పీజీ కనెక్షన్లు ఇచ్చామని చెప్పారు. 'కిసాన్ సమ్మాన్ నిధి' ద్వారా 52 లక్షల మంది రైతులకు నేరుగా ఆర్థిక సాయం అందించామని వివరించారు. 'నేతాజీ సుభాష్ చంద్రబోస్ పుట్టిన గడ్డలో ఇవాళ అక్రమ చొరబాట్లు, మహిళలపై హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. రబీంద్రనాథ్ ఠాగూర్ కలలుకన్న సోనార్ బంగ్లా ప్రమాదంలో పడింది. ఇవాళ బెంగాల్ పూర్వ గౌరవాన్ని పునరుద్ధరించాలి. మార్పు అనివార్యం. బెంగాల్ అభివృద్ధి ప్రయాణంలో అంతా కలిసిరావాలి. 2026లో వికసిత్ వెస్ట్ బెంగాల్ కోసం ప్రతినబూనుదాం' అని మోదీ ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు.

## రాహుల్ తప్పుకోవాలి.. మణిశంకర్ అయ్యర్ సంచలన వ్యాఖ్యలు

మమతా బెనర్జీ, అఖిలేష్ యాదవ్, ఎంకే స్టాలిన్, తేజస్వి యాదవ్ వంటి సమర్థులైన నేతలు రాహుల్ గాంధీ నుంచి పగ్గాలు చేపట్టాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇటీవల పలు ఎన్నికల్లో వైఫల్యాలను చవిచూడడాన్ని అయ్యర్ ప్రస్తావిస్తూ, మమతా బెనర్జీని దూరం చేసుకోవడం వల్లే కాంగ్రెస్ బలహీనపడిందని అభిప్రాయపడ్డారు. మమతా బెనర్జీ లేకుంటే 'ఇండియా' కూటమి ఉనికికే ప్రమాదమని అన్నారు. కూటమి బాధ్యతలను తన చేతిలో పెట్టుకోకుండా ప్రాంతీయ పార్టీల నేతలైన స్టాలిన్, మమతా దీదీ, అఖిలేష్, తేజస్వి, ఇంకెవరికైనా రాహుల్ గాంధీ అప్పగిస్తారని ఆశిస్తున్నానని, వారయితే ఎక్కువ సమయం కేటాయించగలరని అయ్యర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీపై మణిశంకర్ అయ్యర్ నిశిత విమర్శలు చేయడం ఇదే మొదటిసారి కాదు. ఇటీవల కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పాల్గొన్న ఒక కార్యక్రమానికి అయ్యర్ హాజరయ్యారు. పినరయి విజయన్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారంటూ ఆయనపై ప్రశంసలు కురిపించారు. త్వరలో కేరళ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో పినరయి విజయన్ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీని ఇరకాటంలో నెట్టింది. మణిశంకర్ అభిప్రాయం పార్టీ అభిప్రాయం కాదని, ఆయన వ్యాఖ్యలు, వ్యాసాలు పూర్తిగా ఆయన వ్యక్తిగతమని పేర్కొంది.

రాజ్యసభ సీటు కోసమే..

కాగా, 'ఇండియా' కూటమి నాయకత్వ బాధ్యతల నుంచి తప్పుకోవాలంటూ అయ్యర్ చేసిన తాజా వ్యాఖ్యలపై కాంగ్రెస్ వెంటనే స్పందించింది. రాహుల్ గాంధీ మాత్రమే ఇండియా కూటమిని సమర్థవంతంగా ముందుకు నడిపించగలరని, బీజేపీని ఎదుర్కొనగలిగే సత్తా రాహుల్‌కే ఉందని ఆ పార్టీ నేత ఇమ్రాన్ మసూద్ వ్యాఖ్యానించారు. బెంగాల్ కాంగ్రెస్ నేతలు సైతం అయ్యర్ వ్యాఖ్యలను ఖండించారు. కాంగ్రెస్ పార్టీకి చాలాకాలంగా మణిశంకర్ అయ్యర్ దూరంగా ఉన్నారని, బెంగాల్ నుంచి ఐదు రాజ్యసభ సీట్లు ఖాళీగా ఉండటమే మణిశంకర్ అయ్యర్ తాజా వ్యాఖ్యలకు కారణం కావచ్చని బెంగాల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సుమన్ రాయ్ అన్నారు.

## తేజస్ 'క్రాష్' కాలేదు, చిన్న సాంకేతిక సమస్యే: హెచ్‌ఏఎల్ స్పష్టత

(ఫిబ్రవరి 23) : భారత వైమానిక దళానికి చెందిన తేలికపాటి యుద్ధ విమానం (ఎల్‌సీఏ) తేజస్ 'క్రాష్' అయిందంటూ వచ్చిన మీడియా నివేదికలను హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్) ఖండించింది. అది ప్రమాదం కాదని, కేవలం ఒక చిన్న సాంకేతిక సమస్య మాత్రమేనని సోమవారం స్పష్టం చేసింది. ఈ మేరకు హెచ్‌ఏఎల్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. "తేజస్ ఘటనపై వచ్చిన మీడియా కథనాలను గమనించాం. ఇందులో వాస్తవాలను స్పష్టం చేయాలనుకుంటున్నాం. తేజస్ విమానం క్రాష్ అయినట్లు ఎటువంటి నివేదిక లేదు. అది కేవలం ఒక చిన్న సాంకేతిక సమస్య మాత్రమే" అని హెచ్‌ఏఎల్ తన ప్రకటనలో పేర్కొంది. సమకాలీన యుద్ధ విమానాల్లో ప్రపంచంలోనే అత్యుత్తమ భద్రతా రికార్డులు తేజస్ సొంతమని బలంగా సమర్థించుకుంది. ఈ సమస్యపై నిబంధనల ప్రకారం లోతైన విశ్లేషణ చేస్తున్నామని, భారత వైమానిక దళంతో కలిసి త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపింది. ఫిబ్రవరి 7న ఒక ఫ్రంట్‌లైన్ ఎయిర్‌బేస్‌లో తేజస్ జెట్ బ్రేక్ ఫెయిల్యూర్ కారణంగా రన్‌వేను దాటిందని, విమానం ఎయిర్‌ఫ్రేమ్‌కు పెద్ద నష్టం వాటిల్లిందని, పైలట్ సురక్షితంగా బయటపడ్డాడని కొన్ని మీడియా నివేదికలు పేర్కొన్నాయి. ఈ నివేదికలను హెచ్‌ఏఎల్ తప్పుడు సమాచారంగా తోసిపుచ్చింది. ఈ ఘటన తర్వాత, భారత వైమానిక దళం (ఐఏఎఫ్) తమ వద్ద ఉన్న సుమారు 30-35 తేజస్ విమానాలన్నింటినీ తనిఖీల కోసం తాత్కాలికంగా నిలిపివేసినట్లు (గ్రౌండెడ్) సమాచారం. ప్రస్తుతం ఈ ఘటనపై భారత వైమానిక దళం 'కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీ'కి ఆదేశించింది.

## ఓటమి భయంతో బీజేపీతో పొత్తు పెట్టుకోవాలని స్టాలిన్ చూస్తున్నారు

(ఫిబ్రవరి 23) : అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి భయంతో బీజేపీతో పొత్తు పెట్టుకోవాలని స్టాలిన్ ప్రభుత్వం చూస్తోందని ప్రముఖ సినీ నటుడు, టీవీకే అధినేత విజయ్ ఆసక్తికర వ్యా ఖ్యలు చేశారు. పరిస్థితులకు అనుగుణంగా మారిపోవడం ఆ పార్టీ నేతలకు అలవాటేనని వ్యాఖ్యానించారు. వేలూరులో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో తనను ఎలాగైనా ఓడించాలనే ఆలోచనతో స్టాలిన్ కుట్రలు పన్నుతున్నారని అన్నారు. డీఎంకేకు ఓటు వేస్తే బీజేపీకి వేసినట్లేనని అన్నారు. ప్రభుత్వాల అవినీతిని ప్రశ్నిస్తున్నందువల్లే తనను లక్ష్యంగా చేసుకుంటున్నారని విజయ్ అన్నారు. తమ పార్టీ నిర్వహించే బహిరంగ సభలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడం లేదని ఆరోపించారు. అందువల్లే తాను అన్ని ప్రాంతాల ప్రజలను కలవలేకపోతున్నానని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి టీవీకే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి గ్రామాన్ని సందర్శిస్తానని హామీ ఇచ్చారు. తనను ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా వెనక్కి తగ్గేది లేదని అన్నారు. అవినీతిని ప్రశ్నించడం ఆపేది లేదని స్పష్టం చేశారు. అవినీతి, అక్రమాలను అరికట్టడంలో స్టాలిన్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలు తమిళనాడు ప్రజలకు, అవినీతి ప్రభుత్వానికి యుద్ధమని వ్యాఖ్యానించారు.

## కల్తీపాల బాధ్యులను వదిలేది లేదు

కొనసాగుతోందని చెప్పారు. మృతులు కృష్ణవేణి, రాధాకృష్ణ, శేషగిరిరావు, రమణిల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పాలతోనే డయాలసిస్ సమస్య వచ్చిందన్నారు. కల్తీ పాల బాధ్యులను వదిలేది లేదని తేల్చి చెప్పారు. పాల వ్యాపారి నాగేశ్వరరావును అరెస్ట్ చేశామని చెప్పారు. కల్తీ చేస్తే ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. దోషులపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. కల్తీ పాల మృతుల కుటుంబాలకు పరిహారం ప్రకటించారు. ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున పరిహారం అందిస్తామని వెల్లడించారు. కొద్దిసేపటి క్రితం రాజమండ్రిలో అనూరియా వ్యాధి మరణాలపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఘటనపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు అందుతున్న వైద్యసాయాన్ని అధికారులు సీఎంకు వివరించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. కాగా, రాజమహేంద్రవరంలోని లాలాచెరువు సమీపం లోని చౌడేశ్వరినగర్ పరిసర ప్రాంతాల్లో ఫిబ్రవరి 15 నుంచి పలువురు.. వాంతులు, మూత్ర విసర్జన కాకపోవడం, కడుపు ఉబ్బరం తదితర సమస్యలతో బాధపడుతున్నారు. ఈ రకమైన కారణాలతో 14 మంది నగరంలోని వివిధ ఆసుపత్రుల్లో చేరారు. వీరిలో కృష్ణవేణి, రాధాకృష్ణ, శేషగిరిరావు, రమణి మృతి చెందారు.

## ఉగాదికి జాబ్ క్యాలెండర్.. జాబితాలోనే డీఎస్సీ పోస్టులు!

సమస్యలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి నారా లోకేశ్ సమాధానమిచ్చారు. రాష్ట్రంలోని నిరుద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న జాబ్ క్యాలెండర్‌ను ఉగాది పండుగ సందర్భంగా విడుదల చేస్తామని మంత్రి లోకేశ్ ప్రకటించారు. విశేషమేమిటంటే, ఈ జాబ్ క్యాలెండర్‌లోనే డీఎస్సీ (DSC) పోస్టులను కూడా చేర్చనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇది ఉపాధ్యాయ వృత్తిని ఆశించే వేలాది మంది అభ్యర్థులకు పెద్ద ఊరటనిచ్చే అంశం.

కేజీబీవీ పాఠశాలలపై చర్చ

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల(KGBV) పనితీరుపై ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, ఎమ్మెల్యే మురళీ మోహన్ పలు అంశాలను ప్రస్తావించారు. ఏపీలో కేజీబీవీ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతితో పాటు ఇంటర్మీడియట్ కూడా అందిస్తున్నారని, ఇక్కడ పనిచేస్తున్న వారికి ఎంటిఎస్ (MTS) అమలు చేయాలని, రెగ్యులర్ ప్రిన్సిపాళ్లను నియమించాలని కోరారు. దీనికి మంత్రి నారా లోకేశ్ సమాధానమిస్తూ.. ఇతర రాష్ట్రాల కంటే ఏపీలో కేజీబీవీలకు ఎక్కువ డిమాండ్ ఉందని, అడ్మిషన్ల కోసం తీవ్రమైన పోటీ నెలకొందని తెలిపారు. జీతాల పెంపుదలపై కేంద్ర ప్రభుత్వంతో చర్చించామని, కేంద్రం సహకారం అందిస్తే మరిన్ని చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

పాలిటెక్నిక్, ఐటీఐ విద్య బలోపేతం

ఉన్నత విద్యలో ఇంజనీరింగ్‌తో పాటు పాలిటెక్నిక్, ఐటీఐల ప్రాధాన్యాన్ని మంత్రి వివరించారు. ఉత్తరాంధ్రలో ఏర్పడుతున్న పారిశ్రామిక ఎకో సిస్టమ్‌కు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. విజయనగరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మరమ్మతులను 'క్లస్టర్ బేస్డ్ అప్రోచ్' ద్వారా వచ్చే ఏడాదిలోగా పూర్తి చేస్తామని మంత్రి వెల్లడించారు.


## డి.ఆర్ బి తెలుగు భాషా సేవలు ప్రశంసనీయం

పిబ్రవరి 23(గుడివాడ):టిడిపి సీనియర్ లీడర్ లింగం ప్రసాద్ తెలుగు భాష వికాస సమితి సమన్వయకర్త డి.ఆర్.బి ప్రసాద్ గత రెండున్నర దశాబ్దాలుగా తెలుగు భాషాభివృద్ధికి చేస్తున్న కృషి ప్రశంసనీయమని టిడిపి సీనియర్ లీడర్ లింగం ప్రసాద్ అభినందించారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా స్థానిక నవభారత్ ఖాదీస్టోర్ లో డి ఆర్ బి ని పలువురు సత్కరించారు. ఈ సందర్భంగా లింగం ప్రసాద్ మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా తెలుగు భాషాభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలను తన సొంత వ్యయంతో నిర్వహిస్తున్నారన్నారు. భాషాభివృద్ధికి కృషి చేసిన మహనీయుల జయంతులు నిర్వహిస్తూ వారి పేరిట స్ఫూర్తి పురస్కారాలు అందజేస్తున్నారని, ఈ సందర్భంగా డిఆర్బిని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ గఫార్ భీమేశ్వరాలయం కమిటీ చైర్మన్ పట్టాపు వెంకట సత్యనారాయణ (చిన్న)



కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు, ఎన్జీ జీవో జిల్లా నాయకులు షేక్ ఫరీద్ భాష తదితరులు పాల్గొన్నారు

## ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలి : కలెక్టర్






మచిలీపట్నం, ఫిబ్రవరి 23:జిల్లాలో అన్ని పోలింగ్ స్టేషన్ల పరిధిలో బూత్ స్థాయి ఏజెంట్లను నియమించి స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు.

సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్, కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదామును తనిఖీ చేసి అందులోని ఈవీఎంలను పరిశీలించారు. అనంతరం తన ఛాంబర్ లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా తయారీలో బూతు స్థాయి అధికారులకు రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్ల సహకారం చాలా అవసరం ఉ ందన్నారు.వచ్చే ఏప్రిల్ నెలలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి రాజకీయ పార్టీ వారికి చెందిన బూతు స్థాయి ఏజెంట్లను తప్పనిసరిగా నియమించాలన్నారు. తద్వారా స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపొందించుటకు అవకాశం లభిస్తుందన్నారు. ఇప్పటివరకు తెలుగుదేశం పార్టీ కొంతవరకు బూత్ సాయి ఏజెంట్లను నియమించిందని మిగిలిన పార్టీలు కూడా వెంటనే బిఎల్ఎ లను నియమించాలని సూచించారు.ఇప్పుడు బూతు సాయి ఏజెంట్లను నియమించుకోకుండా ఆ తర్వాత ఓటర్ల జాబితా సరిగా లేదని వేలెత్తి చూపడం సరికాదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.జిల్లాలో ఫారం 6, 7, 8 క్లెయిములకు సంబంధించి మొత్తం 76,170 అర్జీలు అందగా అందులో 73,474 అర్జీలను పరిష్కరించామని, మిగిలిన 2,696 అర్జీలు పురోగతిలో ఉన్నాయన్నారు.జిల్లాలో 1769 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, అందులో 32 పోలింగ్ కేంద్రాల స్థలాలను మార్చేందుకు ప్రతిపాదనలు చేశామని, మరో 170 పోలింగ్ కేంద్రాలను నామకరణం మార్చాలని ప్రతిపాదించామని, 73 కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. ఆ ప్రకారం మొత్తం 1842 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు అయ్యే అవకాశం ఉందన్నారు.ఈ సమావేశంలో డిఆర్ఓ చంద్రశేఖర రావు, టిడిపి, బిజెపి, సిపిఐ, వైసీపీ, బీఎస్పీ ల ప్రతినిధులు బియం.వి.దాస్, పివి గజేంద్రరావు, కొడాలి శర్మ, సిలార్ దాదా, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ ఆలోచన దినోత్సవం





యాడికి ఫిబ్రవరి 23 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక:మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నెంబర్ 4 ఆవరణం యందు స్కౌట్ వ్యవస్థాపకులు రాబర్ట్ బెడన్ పావెల్ మరియు వారి శ్రీమతి ఓలవీ బడెన్ పావెల్ పుట్టినరోజు సందర్భంగా ఫిబ్రవరి 22 వ తేదీన ప్రపంచ ఆలోచన దినోత్సవం జరుపుకోవడం జరిగింది . ఈ సందర్భంగా కార్యక్రమమునకు ముఖ్య అతిథిగా హాజరు ఐన మండల విద్యాధికారి యం. కాశప్ప మాట్లాడుతూ చిన్న వయసులోనే పిల్లలకు సేవాభావం, క్రమశిక్షణ, సహాయం చేసే మంచి లక్షణాలు అలవాటు చేయడము లో ఈ స్కౌట్ కార్యక్రమం చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. భవిష్యత్ లో ఈ స్కౌట్ కార్యక్రమంలకు తన వంతు పాఠశాల కు సహాయం చేస్తానని తెలియపరచి, స్కౌట్ మాస్టర్, మరియు పాఠశాల సిబ్బందికి అభినందనలు తెలిపారు. మరియు విశ్రాంత హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు విజయమ్మ స్కౌట్ యూనిట్ కి ఏడు వేల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. భవిష్యత్ లో స్కౌట్ కార్యక్రమంలో భాగంగా ఏదైనా ఆర్థిక సహాయం అందించడానికి తన వంతు ఎల్లప్పుడూ ముందు ఉంటాను అని తెలిపారు. ఈ సందర్భంగా విజయమ్మ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో నే ఇటువంటి మంచి క్రమశిక్షణ కలిగిన స్కౌట్ గురించి తెలియపరచి ఆపద సమయంలోను, ప్రకృతి విపత్తులు, ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే సహాయ , సహకారాలు చేసే విధంగా చిన్న వయసులోనే ఆలోచన చేసే మంచి కార్యక్రమం స్కౌట్ అని కొనియాడారు. ఈ సందర్భంగా స్కౌట్ యూనిట్ కి దాత ఐన విజయమ్మ ని పాఠశాల ఉపాధ్యాయ బృందము మరియు విద్యార్థులు ఘనంగా సన్మానం చేయడము జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయు లు చంద్రశేఖర్, శైలజ కుమారి, రవీంద్ర, స్కౌట్ మాస్టర్ వరలక్ష్మీ, పద్మావతి, రంగస్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు...

# సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని ఈ సేవ కేంద్రంలోకి తరలించాలి



నూజివీడు పట్టణంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని తక్షణమే సౌకర్యవంతమైన సురక్షితంగా ఉండే ప్రభుత్వ ఈ సేవ కేంద్రం భవనంలోకి తరలించాలని దస్తావేజులేఖరి మహమ్మద్ అలీ అబ్బాస్ కోరారు. ఈ మేరకు నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కొనసాగుతున్న సబ్ రిజిస్టర్ కార్యాలయం ముస్లింల ప్రార్ధనా మందిరం మస్జిద్, అనేక వ్యాపార కూడళ్ళు ఉన్న ప్రదేశం, పీఎం శ్రీ ఎస్ఆర్ఆర్ జడ్పీ హైస్కూల్ వంటి రద్దీగా ఉండే ప్రదేశాలకు నడుమ నిర్వహించడం జరుగుతోందన్నారు. సబ్ రిజిస్టర్ కార్యాలయం లో తమ తమ ఆస్తుల క్రయవిక్రయాలు, అగ్రిమెంట్లు, తనఖా వంటి లావాదేవీలు కొనసాగించేందుకు వచ్చే భూ యజమానులు, రైతులు, కక్షిదారులు, అందుకు సాక్ష్యంగా నిలిచే సాక్షులు అనేక అవస్థలు పడుతున్నారని తెలియజేశారు. సబ్ రిజిస్టర్ కార్యాలయం సరిపోక రహదారిపై పాకవేసి రోడ్డుపైనే రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని పలు ప్రజాసంఘాల నాయకులు ఇప్పటికే ఆరోపించిన విషయాన్ని ఉటంకించారు. మహిళలు, చిన్నారులు, వయోవృద్ధులు వేచి ఉండేందుకు సరైన ప్రదేశం లేకపోవడం వలన తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్న సంగతి అధికారులు గుర్తించాలన్నారు. ముఖ్యంగా మరుగుదొడ్డి సౌకర్యం లేకపోవడం అత్యంత విచారకరమన్నారు. మహిళలకు జరుగుతున్న అసౌకర్యాలపై పలు మహిళా సంఘాల నాయకులు స్పందించాలని సూచించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అన్ని సౌకర్యాలు ఉన్న, అత్యంత విశాలమైన ప్రభుత్వ మీసేవ కేంద్రం ప్రాంగణంలోకి సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని తక్షణమే తరలించాలని కోరారు. మీసేవ కేంద్రం గతంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించారని, ప్రస్తుతం మూతపడి ఉన్నట్లు చెప్పారు. ఈ మీసేవ కేంద్రానికి కొద్దిపాటి మరమ్మత్తులు నిర్వహించి, సబ్ రిజిస్టర్ కార్యాలయం తాత్కాలికంగా కొనసాగేలా అధికారులు, రాష్ట్ర గృహనిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారథి లు చొరవ చూపాలని కోరారు. సబ్ రిజిస్టర్ కార్యాలయ నిర్మాణం కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని సద్వినియోగం చేసుకుంటూ, సొంత భవనాన్ని త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసినట్లయితే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. ఈ మేరకు సొంతభవనం నిర్మించేందుకు రాష్ట్ర మంత్రి కొలుసు పార్ధసారథి ఇప్పటికే అనేక ప్రయత్నాలు ప్రారంభించినట్లు వివరించారు.

# జర్నలిస్టుల ఉచిత హెల్మెట్ పంపిణీ బ్రోచర్ ను ప్రారంభించిన జిల్లా ఎస్పీ జగదీష్

**- వచ్చేవారం జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులకు ఉచిత హెల్మెట్ పంపిణీ**

**- మచ్చా రామలింగారెడ్డి రాష్ట్ర అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్**






అనంతపురం ఫిబ్రవరి 23 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక: జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులందరూ హెల్మెట్ ధరించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క జర్నలిస్టు మీద ఉంది అని జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నివారించాలన్నదే జిల్లా పోలీస్ శాఖ లక్ష్యమని అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ అన్నారు. అనంతపురం నగరంలోని ఎస్పీ కార్యాలయం నందు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ఏపీ జర్నలిస్టు డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టుల ఉచిత హెల్మెట్ పంపిణీ కార్యక్రమానికి సంబంధించి ప్రచార పోస్టర్ ను జిల్లా ఎస్పీ పి జగదీష్ జిల్లాలోని ట్రైని ఐపీఎస్ అధికారి వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మచ్చా రామలింగారెడ్డి ప్రారంభించారు. జిల్లా పోలీస్ శాఖ తీసుకున్న నిర్ణయానికి మద్దతుగా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ హెల్మెట్ ధరించాలి, రోడ్డు ప్రమాదాలు నివారించాలి అనే కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని ఇది అన్ని వర్గాలకు స్ఫూర్తినిస్తుందని వర్కింగ్ జర్నలిస్టులందరినీ అభినందిస్తున్నానని జిల్లా ఎస్పీ జగదీష్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పి జగదీష్ మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని వాటిని తగ్గించాలని లక్ష్యంతో నో హెల్మెట్ నో పెట్రోల్ అనే కార్యక్రమాన్ని తీసుకున్నామని ప్రజల నుంచి స్పందన బాగున్నదని అది ఇంకా కొనసాగిస్తామని కొంత పని ఒత్తిడితో కొంత నిదానంగా జరుగుతున్నదని ఎస్పీ జగదీష్ అన్నారు. జిల్లాలో సరాసరి రోజుకి 40 నుంచి 50 మంది హెల్మెట్ లేకుండా ఉండడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారని అది లేకుండా చూడాలన్నదే తమ ప్రయత్నమని ఎస్పీ జగదీష్ అన్నారు జిల్లాలోని ప్రజలు యువత అందరూ పోలీస్ శాఖకు సహకరించాలని అందరూ హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని అలా చేసినప్పుడే ప్రమాదాలు నివారించవచ్చునని అది ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని జిల్లా ఎస్పీ జగదీష్ అన్నారు. వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మచ్చా రామలింగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని విధంగా అనంతపురం జిల్లాలో జిల్లా పోలీస్ శాఖ జిల్లా ఎస్పీ జగదీష్ ప్రత్యేక చొరవ చూపి ఒక్కరు హెల్మెట్ ధరించాలి అని ప్రజల్ని చైతన్యవంతులు చేస్తున్న కార్యక్రమానికి వర్కింగ్ జర్నలిస్టుగా మద్దతు ఇవ్వాలనేటువంటి ఉద్దేశంతో మేము కూడా జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టు అందరికీ వచ్చేవారం ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ జగదీష్ ని వర్కింగ్ జర్నలిస్టులు యూనియన్ గా అభినందిస్తున్నామని ఈ కార్యక్రమానికి వర్కింగ్ జర్నలిస్టుగా తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో రాబోవు రోజుల్లో కొనసాగిస్తామని ఎక్కువ జిల్లాల్లో ఉచితంగా హెల్మెట్లు ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ పంపిణీ చేస్తుందని వచ్చేవారం అనంతపురం జిల్లా నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడతామని అనంతపురం నగరంలో జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేస్తామని మచ్చా రామలింగారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ నాయకులు షాకీర్, వెంకటేష్, రమణారెడ్డి, దాదు నాయక్ జానీ, త్యాగరాజ్ ,వెంకట్ , మురళి, ప్రసాద్ పెద్ద ఎత్తున నగరంలోని జర్నలిస్టులు పాల్గొన్నారు....


# ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ ఫస్టియర్ పబ్లిక్ పరీక్షలు



నూజివీడు పట్టణంలో మొదటి రోజు ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నూజివీడు పట్టణంలోని ఆరు పరీక్ష కేంద్రాలలో నిర్వహించిన ఇంటర్మీడియట్ ఫస్టియర్ పరీక్షలకు 84 మంది గైరు హాజరు అయినట్లు కస్టోడియన్ ఎమ్ స్వర్ణలత సోమవారం తెలిపారు. మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 198 మందికి గాను 179 మంది హాజరు కాగా 19 మంది గైర్ హాజర్ అయినట్లు చెప్పారు. వాగ్దేవి కళాశాలలో 293 మందికి 286 మంది హాజరు కాగా ఏడుగురు విద్యార్థులు గైర్హాజర్ అయ్యారన్నారు. సెంట్ ఆన్స్ లో 290 మందికి 278 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 12 మంది విద్యార్థులు గైర్హాజర్ అయినట్లు చెప్పారు. సిద్ధార్థ కాలేజీలో 337 మందికి 323 మంది పరీక్షకు హాజరు కాగా, 14 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజర్ అయ్యారన్నారు. శారదా కాలేజీలో 432 మందికి 416 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 16 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదన్నారు. బాలయోగి గురుకులంలో 241 మందికి 225 మంది హాజరై పరీక్షలు వ్రాయగా, 16 మంది విద్యార్థులు మొదటి రోజు ఇంటర్మీడియట్ ఫస్టియర్ పరీక్షకు గైర్హాజర్ అయినట్లు చెప్పారు. మొత్తం నూజివీడు పట్టణంలోని ఆరు పరీక్ష కేంద్రాలలో 1791 మంది పరీక్షలు రాయవలసి ఉండగా 1707 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 84 మంది విద్యార్థులు పరీక్షకు గైరు హాజరైనట్లు వివరించారు.

# కార్డ్స్ సంస్థ బాలబాట ద్వారా అందిస్తున్న సేవలు అభినందనీయం

## దుర్గి ఎంపీడీవో సుగుణ



నేటి శుభోదయ 23 ఫిబ్రవరి పల్నాడు జిల్లా దుర్గి : కార్డ్స్ సంస్థ బాలబాట ద్వారా దళితులు,పేదల విద్యా చైతన్య కోసం చేస్తున్న కృషి, అందిస్తున్న సేవలు అభినందనీయమని దుర్గి మండల ప్రజా పరిషత్ అధికారి సుగుణ అన్నారు. సోమవారం దుర్గి ఎంపీడీవో కార్యాలయంలోని కార్డ్స్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ తాళ్లూరి అమర్నాథ్ ఆధ్వర్యంలో సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష మోడల్ ప్రశ్నా జవాబు పత్రాన్ని ఆమె చేతుల మీదుగా ప్రజాసంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాళ్లూరి అమర్నాథ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కార్డ్స్ సంస్థ బాలబాట ద్వారా గ్రామాలలో బాలబాటల పాఠశాలలు ఏర్పాటు చేయించి బాలబాట ఉపాధ్యాయుల ద్వారా దళిత,పేద విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్యను ఉచితంగా అందిస్తూ,ఆర్థిక సహాయం చేస్తూ, సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలలో ఐదవ తరగతి పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తూ మోడల్ ప్రశ్న జవాబు పత్రాన్ని తయారు చేసి వారికి అవగాహన చేయటం జరుగుతుందని, దానిలో భాగంగానే పల్నాడు జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో మోడల్ ప్రశ్న,జవాబు పత్రాన్ని ఆవిష్కరించి విద్యార్థులకు అవగాహన చేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని దళిత పేద, విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పల్నాడు జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ కుక్కమూడి ప్రసాద్ మాట్లాడుతూ కార్డ్స్ సంస్థ దళిత పేద విద్యార్థులకు ఒక వరం అన్నారు. ఈ కార్యక్రమంలో బాలబాట దుర్గి మండల ఏసిఓ కుక్కమూడి ప్రమీల ,సీనియర్ దళిత నాయకులు నాగెండ్ల కాటయ్య సిద్దెల మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**-గన్నవరం మటన్ మార్కెట్ దుకాణదారులకు తాగునీటి సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యే యార్లగడ్డ**



గన్నవరం, ఫిబ్రవరి 23 ( అజయ్ నారగాని- నేటి శుభోదయ) గన్నవరం మటన్ మార్కెట్లో జీవనోపాధి సాగిస్తున్న 19 మంది దుకాణదారులు తాగునీటి సౌకర్యం కోసం ఎన్నాళ్లుగానో ఇబ్బందులకు గురయ్యారు. దుకాణదారుల కష్టాన్ని గుర్తించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు వెంటనే స్పందించి పైప్‌లైన్ ఏర్పాటు చేయించడంతో వ్యాపారుల్లో ఆనందం వెల్లివిరిసింది. ప్రజా సమస్యల పరిష్కారమే తన రాజకీయ ధ్యేయమని మరోసారి చాటిచెప్పిన ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలుపుతూ, గన్నవరం టౌన్ టిడిపి అధ్యక్షులు జాస్తి శ్రీధర్ నిర్వహించిన సన్మాన కార్యక్రమం హృద్యంగా జరిగింది. “మా సమస్యను వెంటనే గుర్తించి పరిష్కరించిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నిజంగా ప్రజల పక్షాన నిలిచే నాయకుడు” అని దుకాణదారులు భావోద్వేగంగా పేర్కొంటూ ఎమ్మెల్యే వెంకట్రావ్ , జాస్తి శ్రీధర్, గన్నవరం పంచాయతీ అధికారులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# నగిరి ఐసిడిఎస్ కార్యాలయం దగ్గర రిలే నిరాహార దీక్షలు

## సిఐటియు ఏఐటీయూసీ ఐ ఎఫ్ టి యు డిమాండ్






నేటి శుభోదయ. చిత్తూరు జిల్లా నగిరి ,ఇప్పుడు జరుగుతున్న రాష్ట్ర బడ్జెట్ సమావేశాలలో అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని,మిగిలిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నగిరి ఐసిడిఎస్ కార్యాలయం దగ్గర రిలే నిరాహార దీక్షలు....... సిఐటియు ఏఐటీయూసీ ఐ ఎఫ్ టి యు డిమాండ్. ఈ రోజు అంగన్వాడి సమస్యల పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా ఏ ఐ టి యు సి సిఐటియు ఐఎఫ్టియు ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు అందులో భాగంగా నగిరిలో అంగన్వాడి వర్కర్స్ మూడు సంఘాల ఆధ్వర్యంలో ఆ యూనియన్ నాయకులు ధనకోటి శాంతి ఉమా అధ్యక్షతన ప్రారంభమైంది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య మాట్లాడుతూ మన రాష్ట్రంలో పేదగర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్వాడీవర్కర్లు, హెల్పర్లు, మినీవర్కర్లు, అనేక సేవలు అందిస్తున్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 2019 నుండి అంగన్వాడీలకు వేతనాలు పెరగలేదు. అంగన్వాడీలకి వేతనాల పెంపు తదితర సమస్యల పరిష్కారం చేయాలని 2023 డిశంబర్ లో 42 రోజుల పాటు చారిత్రాత్మక సమ్మె నిర్వహించాము. ఆ సమ్మె ముగింపు సందర్భంగా 2024 జూలైలో అంగన్వాడీలకు వేతనాలు పెంచుతామని, ఇతర సమస్యలు పరిష్కారం చేస్తామని ప్రభుత్వం మినిట్స్ కాపీ ఇచ్చారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా అంగన్వాడీల వేతనాలు పెంచాలని అనేకమార్లు ప్రభుత్వానికి ఏఐటీయూసీ సిఐటియు ఐఎఫ్టియు మూడు సంఘాలు కలిసి విన్నవించాం. అయినా నేటి వరకు అంగన్వాడీలకు వేతనాలు పెంచలేదు. కనీసం ఇప్పుడు జరుగుతున్న బడ్జెట్ సమావేశాల సందర్భంగానైనా అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేసారు. ఇంకా కొంతమంది. అర్హత ఉన్న మినీ వర్కర్లు 10వ తరగతి పాస్ అయిన మెయిన్ సెంటర్లుగా అప్ గ్రేడ్ చేయలేదు. మరో 1810 మినీ సెంటర్లలో క్వాలిఫికేషన్ లేదని మెయిన్ సెంటర్లుగా మార్చలేదు. వీరు మినీ వర్కర్లు వర్కర్వని హెల్పర్ పని చేస్తున్నారు. సెంటర్ నిర్వహణ: కావాల్సిన అనుభవం ఉంది. కావున వారికి క్వాలిఫికేషన్ రిలాక్సేషన్ ఇచ్చి మెయిన్ సెంటర్లుగా అప్గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. 2024 మార్చిలో అంగన్వాడీలకు గ్రాట్యూటీ అమలుచేస్తామని జీఓ నెం.8 ఇచ్చారు. అయితే నేటికి సుప్రీంకోర్టు తీర్పుప్రకారం గ్రాట్యూటీ చట్టానికి అమలుచేయడానికి గైడ్లైన్స్ రూపొందించలేదు. 2025 డిశంబర్ తరువాత కొంతమంది రిటైర్మెంట్ అయ్యారు. కొంతమంది సర్వీసులో ఉండి చనిపోయారు. వారికి ఎటువంటి బెనిఫిట్ రావడంలేదు. రూరల్లో ఉన్న అంగన్వాడీ వర్కర్లకు సంక్షేమపథకాలు అమలుకావడంలేదు. హెల్పర్ల ప్రమోషన్లో రాజకీయ జోక్యం వలన అర్హులకు ప్రమోషన్లు కోల్పోతున్నారు. ప్రీస్కూల్ పిల్లలకు సాయంత్రం ఇస్తున్న స్నాక్స్ని ఆపేయడం బాధాకరమన్నారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26000/-లు ఇవ్వాలి. గ్రాట్యూటి అమలుకు గైడ్ లేన్స్ రూపొందించాలి. వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలి. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అర్బన్, రూరల్ తేదీ లేకుండా అందరికీ అమలుచేయాలి. హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడ్లైన్స్ రూపొందించి అమలుచెయ్యాలి. పెండింగ్లో ఉన్న 164 సూపర్వైజర్ పోస్టులు వెంటనే భర్తీచేయాలి. మే నెల అంతా వేసవి సెలవుల జీఓ వెంటనే ఇవ్వాలి. లబ్దిదారులకు బియ్యం, ఆయిల్, కందిపప్పు క్వాంటిటి పెంచాలి, మెనూచార్జీలు పెంచాలి. ఉచితంగా గ్యాస్ సరఫరాచెయ్యాలి. ప్రీ స్కూల్ బలోపేతం చేయాలి. ప్రీ స్కూల్ పిల్లలకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలి. 5 సంవత్సరాల్లోపు పిల్లలందరూ అంగన్వాడీ సెంటర్లో ఉండాలని జీవోఇవ్వాలి. ప్రీస్కూల్ పిల్లలకు సాయంత్రం స్నాక్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పై సమస్యలు పరిష్కారం కానీ ఎడల మార్చి రెండున చాలా విజయవాడ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున అంగన్వాడి వర్కర్స్ తరలి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య ఏఐటీయూసీ నాయకులు సుబ్రహ్మణ్య అంగన్వాడి వర్కర్స్ యూనియన్ మూడు సంఘాల నాయకులు ధనకోటి వనిత శాంతి ఉమా మునెమ్మ శాంతి విజయ ఉమామహేశ్వరి హైమావతి కళ షీలా మలర్ లక్ష్మీదేవి విజయ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఈవారం శానిటేషన్ హీరో నిఖిల్







నూజివీడు పట్టణంలో పరిశుభ్ర కార్యక్రమంలో ఈ వారం శానిటేషన్ హీరోగా యారాం నిఖిల్ ఎంపికయ్యారు. ఈ మేరకు మీకోసం కార్యక్రమంలో సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న సోమవారం నిఖిల్ కు నూతన వస్త్రాలు బహూకరించారు. సబ్ కలెక్టర్ వినూత్న మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయవద్దని, డస్ట్ బిన్స్ ఉపయోగించాలని సూచించారు. ఇప్పటికే అందరి సహకారంతో నూజివీడు టౌన్ క్లీన్ అండ్ బ్యూటిఫికేషన్ అనే గ్రూపు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. నూజివీడు పట్టణంలోని ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. దయచేసి డ్రైనేజీలను డస్ట్ బిన్స్ గా మార్చవద్దని కోరారు. తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా పట్టణంలోని అన్ని వార్డులలో సేకరించేందుకు గ్రీన్ అంబాసిడర్స్ ఇళ్ల వద్దకే వస్తున్నట్లు తెలిపారు. చెత్తను బయటకు విసిరి వేయకుండా డస్ట్ బిన్సులో ఉంచాలన్నారు. గ్రీన్ అంబాసిడర్స్ చెత్త సేకరణకు వచ్చిన సమయంలో తడి చెత్తను వేరుగా పొడి చెత్తను వేరుగా అందించాలని సూచించారు. మన పట్టణాన్ని మనం పరిశుభ్రంగా ఉంచుకుంటే... పట్టణంలో నివసించే మనమంతా ఆరోగ్యంగా ఉంటామని తెలుసుకోవాలన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయవలసిన అవసరం ఉందన్నారు.

# అంగన్వాడీలకు కనీస వేతనం రూ 26,000 ఇవ్వాలి






పులిచెర్ల, ఫిబ్రవరి 23,(నేటి శుభోదయ) :అంగన్ వాడీ లకు కనీస వేతనం రూ 26,000 ఇవ్వాలని అంగన్ వాడి వర్కర్స్, అండ్ వెల్ఫర్స్ సిబ్బంది నాయకురాలు సరస్వతి, అలివేలు, ప్రేమలత, మోబిన్ తాజ్ అన్నారు. చిత్తూరు జిల్లా పులిచెర్ల ప్రాజెక్ట్ ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట సోమవారం అంగన్వాడీ సిబ్బంది న్యాయపరమైన కోరికలు పరిష్కరించాలని కోరుతూ రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్వాడి యూనియన్ నాయకురాలు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుయిటి అమలు చేయాలని, అంగన్వాడీలకు మే నెల మొత్తం టి .హెచ్ .ఆర్ తో కూడిన వేసవి సెలవులు ఇవ్వాలని, లబ్ధిదారులకు బియ్యం, పప్పు, ఆయిల్ క్వాలిటీ పెంచాలని, ప్రీ స్కూల్ బలోపేతం చేయాలని కోరారు. ఇప్పుడు జరుగుతున్న బడ్జెట్ సమావేశాల్లో అంగన్వాడీల న్యాయమైన కోరికలు గురించి జీవో విడుదల చేయాలని కోరారు. ఈ రిలే నిరాహార దీక్ష కార్యక్రమంలో అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

# రాజమహేంద్రవరం అనూరియా కేసులపై మంత్రి కందుల దుర్గేష్ ఆరా

## బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా అధికార యంత్రాంగానికి ఆదేశం




విజయవాడ, ఫిబ్రవరి 23 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) రాజమహేంద్రవరంలో ప్రజలను కలవరపెడుతున్న అనూరియా (మూత్ర విసర్జన నిలిచిపోవడం) కేసుల పట్ల రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తీవ్రంగా స్పందించారు. ఈ పరిస్థితిపై ఆయన సోమవారం తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మరియు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో ఫోన్లో సమీక్ష నిర్వహించారు. బాధితులందరికీ తక్షణమే మెరుగైన వైద్యం అందించాలని, పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లా యంత్రాంగాన్ని మంత్రి దుర్గేష్ ఆదేశించారు. ప్రభుత్వం ఇప్పటికే క్షేత్రస్థాయిలో అన్ని ముందస్తు చర్యలు చేపట్టిందని, ప్రజలు ఎవరూ భయాందోళనలకు గురికావద్దని సూచించారు. ఇప్పటికే ప్రత్యేక వైద్య బృందాల ద్వారా ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నామని, ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ ద్వారా ఈ సమస్యకు గల మూల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోందని వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే కలెక్టర్, ఎస్పీ, ఫుడ్ సేఫ్టీ అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించి, పరిస్థితిని సమీక్షించారని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. కల్తీ పాల ఘటనలో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక్కొక్కరికి రూ. 10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారని మంత్రి దుర్గేష్ తెలిపారు. ఈ ఘటనపై విచారణ ముమ్మరంగా సాగుతోందని, ఇప్పటికే నమూనాలు సేకరించి ల్యాబ్లకు పంపించామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.

# గంజాయి, మత్తు పదార్థాలు అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.... సిఐ శరత్ బాబు

## డ్రగ్స్ వాడకంపై విద్యార్థులకు అవగాహన కల్పించిన సీఐ...







పల్నాడు జిల్లా కారంపూడి మండలం పరిధిలోని స్థానిక సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ లో డగ్స్ వద్దు బ్రో నినాదంపై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.. రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ పై అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా ఈగల్ టీం టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తూ విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు అన్ని పాఠశాలలు, కళాశాలలోనూ ప్రత్యేక సదస్సులు పోలీస్ శాఖ నిర్వహిస్తుంది.. సోమవారం జరిగిన సదస్సులో కారంపూడి సర్కిల్ సి ఐ శరత్ బాబు మాట్లాడుతూ గంజాయి తంబాకు, నిషేధిత పొగాకు ఉత్పత్తుల అమ్మకాలపై ప్రత్యేక దృష్టి సారించి అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.. గంజాయి వంటి మత్తు పదార్థాలు సేవించడం వలన జరిగే అనార్థాలను పాఠశాలల్లోని విద్యార్థిని విద్యార్థులకు కళ్ళకు కట్టినట్లు వివరించారు.. మత్తు పదార్థాలు సేవించడం వల్ల జరిగే అనర్థాలను తల్లిదండ్రులకు, మీ ప్రాంతంలోని తెలిసిన వారికి వివరించాలని విద్యార్థులను ఆయన కోరారు.. డ్రగ్స్ వద్దు..చదువు ముద్దు అనే నినాదంతో ప్రతిఒక్క విద్యార్థి డ్రగ్స్ కు దూరంగా ఉంటూ చదువుకొని తల్లితండ్రులకు మంచి గౌరవం తెచ్చేలా ప్రతిఒక్క విద్యార్థి ఉన్నత స్థానాలను అధిరోహించాలని,డ్రగ్స్ కు అలవాటు పడి విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని కోరారు. ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ అనే నినాదంతో స్కూల్స్, కళాశాలల చుట్టూపక్కల 100 మీటర్ల పరిధిలో అమ్మకాలు జరిపే షాపులు యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు..ఈ కార్యక్రమంలో సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండంట్ అనిల్ కుమార్, ఈగల్ టీమ్ బృందం, సిబ్బంది రామకృష్ణ, సురేష్, మల్లీశ్వరి,జానీ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలి



పులిచెర్ల, ఫిబ్రవరి 23,(నేటి శుభోదయ) : ఆర్థిక అక్షరాస్యత పై మహిళలందరూ అవగాహన కలిగి ఉండాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ హరికృష్ణ అన్నారు. తిరుపతి జిల్లా పాకాల మండలం దామలచెరువు లో వి ఐ టి ఎస్ ఆధ్వర్యంలో గ్రామస్థాయి ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ హరికృష్ణ మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా, ప్రధానమంత్రి సురక్ష బీమా ప్రతి ఒక్కరూ చేయించుకోవాలని ఆడపిల్లలకు సుకన్య సమృద్ధి యోజన పథకం, అటల్ పింఛన్ యోజన పథకాల గురించి అవగాహన కల్పించారు. సైబర్ మోసాలకు అప్రమత్తంగా ఉండాలని,సైబర్ మోసాలకు గురైనప్పుడు వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930 కు కాల్ చేసి బ్యాంకు మేనేజర్ కు సమాచారం తెలియజేయాలని సూచించారు. బ్యాంకులో ఖాతా ఉన్న ప్రతి ఒక్క ఖాతాదారులు కేవైసీ చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సప్తగిరి గ్రామీణ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ చిన్న, ఏటీఎం రామ్మోహన్, డి ఎఫ్ ఎల్ కౌన్సిలర్ ధనకోటి, ప్రభాకర, శివ మహిళలు పాల్గొన్నారు.

# వీధి కుక్కలు... కోతులు... చెత్త కుప్పలు... తాగునీరు... ఇవి సమస్యలు....


## - నూజివీడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలోని చర్చ
## - నూటికి 125% సమస్యలు పరిష్కరిస్తామన్న కమిషనర్




నూజివీడు (నేటి శుభోదయ న్యూస్) : నూజివీడు మున్సిపల్ కార్యాలయంలోని సాధారణ కౌన్సిల్ సమావేశంలో సోమవారం కౌన్సిల్ సభ్యుల ఆసక్తికర చర్చ కొనసాగింది. పట్టణ పరిధిలో కోతులు... వీధి కుక్కల బెడద పెరిగిపోయిందని... చెత్త కుప్పలు... తాగునీటి సమస్యలు అంతకంతకు పెరిగాయని... ఆసక్తికరమైన చర్చ కౌన్సిల్ సభ్యులు కొనసాగించారు. మున్సిపల్ చైర్ పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గ అధ్యక్షతన నిర్వహించిన సాధారణ కౌన్సిల్ సమావేశంలో ఈ చర్చ కొనసాగింది. మున్సిపల్ టిడిపి ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పదేపదే వాహనాల మరమ్మత్తుల పేరుతో లక్షలాది రూపాయలు ఖర్చవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని వాహనాలు ఉన్నాయి... ఎలా వినియోగిస్తున్నారు... ఎందుకు మరమ్మత్తులకు గురి అవుతున్నాయి... పదే పదే మరమ్మతలకు గురయ్యే వాహనాలను ఎందుకు ప్రక్షాళన చేయరు అని ప్రశ్నించారు. మునిసిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ మాట్లాడుతూ పట్టణంలో వీధి కుక్కల బెడద రోజురోజుకీ పెరిగిపోయిందన్నారు. కుక్కలను రక్షించవలసిన బాధ్యత ఉన్న అధికారులు.... పట్టణంలోని మనుషులను కూడా రక్షించాల్సిన బాధ్యత ఉన్నదని గుర్తించాలన్నారు. ఇక కోతులు విషయానికి వస్తే గుంపులు గుంపులుగా దాడులు చేస్తుంటే చిన్నవారి నుంచి పెద్దవారి వరకు అనేక ఇబ్బందులకు గురి అవుతున్న సమస్యను కౌన్సిల్ ముందు ఉంచారు. చెత్త ఎక్కడపడితే అక్కడ కుప్పలుగా పేరుకుపోతోందని... శానిటేషన్ సమస్య రోజురోజుకీ జటిలమవుతుందన్నారు. తాగునీటి విషయానికి వస్తే పట్టణంలోని అన్ని వార్డులలోనూ ఒకే రీతిగా సమస్య ఉన్నదన్నారు. మున్సిపల్ కమిషనర్ కె పీరయ్య మాట్లాడుతూ అన్నింటికీ ఒకే సమాధానంగా ఈ సమస్యలు తమ దృష్టికి తీసుకువచ్చిన కౌన్సిల్ సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతూ... ఇకపై ఈ సమస్యలు తలెత్తకుండా నూటికి 125% పరిష్కరిస్తామని చక్కని సమాధానమిచ్చారు. కమిషనర్ సమాధానంతో స్పందించిన టిడిపి ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అన్నింటికీ ఇలాంటి సమాధానం ఇవ్వడంతో ఇక ఏ సమస్యలనూ కౌన్సిల్ ముందు ఉంచలేక పోతున్నామని అసహనం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ పగడాల సత్యనారాయణ మాట్లాడుతూ కుక్కలకు ఫ్యామిలీ ప్లానింగ్ చేస్తామని చెప్పిన పశుసంవర్ధక శాఖ అధికారులు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. కౌన్సిలర్ నౌడు నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ యాంటీ రేబీస్ వ్యాక్సిన్సు వేస్తున్నారా లేదా... అని ప్రశ్నించారు. ఈ అంశాలకు సంబంధించి సమాధానం చెప్పగలిగిన పశుసంవర్ధక శాఖ ఏడి అధికారి కౌన్సిల్ సమావేశాలకు హాజరు కావాలన్నారు. మిగిలిన శాఖలకు చెందిన అధికారులు సైతం కౌన్సిల్ సమావేశాలకు వస్తేనే సమస్యలకు సరైన పరిష్కారం లభిస్తుందని వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ సూచించారు. చివరికి మున్సిపల్ చైర్ పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గా మాట్లాడుతూ పట్టణంలో చిన్నవారి నుండి పెద్దవారి వరకు కోతులు కుక్కలు బెడదతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సమాధానం చెప్పడం కంటే సమస్యను పరిష్కరించే దిశగా అధికారులు పనిచేయాలని కోరారు.

# సోషల్ మీడియా పోస్టులపై 20 నెలల్లో 1,384 కేసులు, 1,067 మంది అరెస్ట్

## -రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత



విజయవాడ, ఫిబ్రవరి 23 ( అజయ్ నారగాని – నేటి శుభోదయ) సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాల నియంత్రణపై ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాల్లో చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష అడిగిన ప్రశ్నకు హోం మంత్రి వంగలపూడి అనిత సమాధానం ఇచ్చారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాల కట్టడికి మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు ఉపసంఘం రెండుసార్లు సమావేశమై వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు పేర్కొన్నారు. తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో అమలు చేస్తున్న చర్యలను సమీక్షించినట్లు చెప్పారు. మన రాష్ట్రంలో ఎలాంటి చర్యలు తీసుకుంటే సమర్థవంతంగా ఉంటాయన్న అంశంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. విద్వేషపూరిత, అసభ్య పోస్టుల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటివరకు సోషల్ మీడియా పోస్టులపై 1,384 కేసులు నమోదు చేసినట్లు మంత్రి అనిత వెల్లడించారు. ఇందులో 1,067 మందిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. తప్పుడు ప్రచారాల కట్టడికి కొత్త చట్టం తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. అలాగే పాఠశాల విద్యార్థులు సోషల్ మీడియా వినియోగించకుండా చట్టం తీసుకురావాలనే ఆలోచనలో ఉన్నట్లు హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. మరోవైపు 16 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్‌పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దృష్టి పెట్టినట్టు మంత్రి అనిత వెల్లడించారు.

# అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి!

## వి.ఆర్.పురంలో రిలే నిరాహార దీక్షలు!..



వి.ఆర్.పురం,ఫిబ్రవరి23(నేటి శుభోదయ ప్రతినిధి)అంగన్‌వాడీ కార్యకర్తలు,సహాయకుల సమస్యలపరిష్కారంకోరుతూ, సి.ఐ.టి.యు,ఆధ్వర్యంలో వరరామచంద్రాపురంమండలంలోని రేఖపల్లిలో చేపట్టిన,రిలేనిరాహార దీక్షలు సోమవారం మొదటి రోజు దీక్షా శిబిరాన్ని ఎం.పి.పి,కారం లక్ష్మి, పూలమాలలువేసి అధికారికంగా ప్రారంభించారు.దీక్ష శిబిరానికి ముఖ్య అతిథులుగా యు.టి.ఎఫ్, సీనియర్ నాయకులు సున్నం రాజులు,మద్దతుతెలియజేశారు.ఈసందర్భంగా దీక్షాశిబిరాన్ని ఉద్దేశించి సున్నంరాజులు, మాట్లాడుతూ,ఏళ్ల తరబడి ప్రజలకుసేవలందిస్తున్న అంగన్‌వాడీలపట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగావ్యవహరించడం శోచనీయమన్నారు.అంగన్‌వాడీలకు కనీసవేతనం రూ 26,000/వేల రూపాయలు చెల్లించాలని,వారిని వెంటనే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు.?ప్రభుత్వంఇచ్చిన హామీలను అమలుచేయడంలో పూర్తిగావిఫలమైందని విమర్శించారు.యాప్‌ల పేరుతో అంగన్‌వాడీలపై అదనపు పని భారాన్ని మోపడంమానుకోవాలని,"?మెనూచార్జీలు" పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలను పెంచాలని కోరారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటంఆగదని, అంగన్‌వాడీలందరూ ఐక్యంగా ఉండి హక్కులుసాధించుకోవాలని పిలుపునిచ్చారు.?పెద్దఎత్తున తరలివచ్చిన నాయకులుఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,వివిధసంఘాల నాయకులు పాల్గొనితమ సంఘీభావాన్ని తెలియజేశారు. పాల్గొన్నవారిలో ఎం.పి.టి.సి, పూనం ప్రదీప్ కుమార్,రైతు కూలీ సంఘం నాయకులు సోయం చిన్నబాబు,ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు పులి సంతోష్ కుమార్,రైతు సంఘం నాయకులు పంకు సత్తిబాబు, గిరిజనసంఘం నాయకులు కారం సుందరయ్య,పోడియం శ్రీరామమూర్తి,కమ్మచిచ్చు సత్యనారాయణ,సోడి మల్లయ్య, సిహెచ్ సుబ్బారావు,సి.ఐ.టి.యు జిల్లానాయకురాలు రాజేశ్వరి, తదితరులు ఉన్నారు.?మొదటి రోజుదీక్షలో అంగన్‌వాడీ కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని, ప్రభుత్వంఅనుసరిస్తున్న మొండి వైఖరికివ్యతిరేకంగా నినాదాలు చేస్తూతమనిరసనగళాన్ని వినిపించారు.

# పేదల ఆర్థిక స్థితిని పర్చడమే పి - 4లక్ష్యం

## -గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము
## -చెవిటి,మూగ చిన్నారికి దాతల సహకారంతో సమకూర్చినరూ.55వేల విలువచేసే వినికిడి యంత్రాన్ని అందించిన ఎమ్మెల్యే

గుడివాడ ఫిబ్రవరి 23 ( అజయ్ నారగాని – నేటి శుభోదయ ) పేదల ఆర్థికస్థితిని మెరుగు పర్చడమే పి–4 కార్యక్రమ ప్రధాన లక్ష్యమని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. పి–4 కార్యక్రమంలో భాగంగా మూగ చెవిటి వాడైన గుడివాడ బాపూజీ నగర్ కు చెందిన 8ఏళ్ల చిన్నారి మహమ్మద్ రసూల్ కు, ఎన్నారై వీర్నాల బాలాజీ దాతృత్వంతో సమకూర్చిన రూ.55 వేల విలువచేసే వినికిడి యంత్రాన్నీ ప్రజావేదిక కార్యాలయంలో చిన్నారికి సోమవారం ఎమ్మెల్యే రాము అందజేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ దార్శనికులు సీఎం చంద్రబాబు ఆలోచనలో నుంచి పి–4 ఉద్భవించిందన్నారు. సంపద కలిగిన కుటుంబాలు అట్టడుగున ఉన్న కుటుంబాలకు అండగా నిలబడటమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. పేదల సాధికారత కోసం చేపడుతున్న ఈ కార్యక్రమంలో ఉన్నత కుటుంబాల వారంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.



పేద కుటుంబాలను ఆదుకుంటున్న దాతలను ఎమ్మెల్యే రాము అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# చిల్లకల్లు ఐసిడిఎస్ ఆఫీస్ ఎదురుగా ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ ( సిఐటియు) ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు



జగ్గయ్యపేట: ఫిబ్రవరి 23 :ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ ( సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని చిల్లకల్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదురుగా రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కమిటీ సభ్యులు బి.రాము, సిఐటియు జగ్గయ్యపేట మండల కార్యదర్శి షేక్ గౌస్ మియా మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26000/–లు ఇవ్వాలని, పెండింగ్ లో ఉన్న 1810 మినీవర్కర్లకు క్వాలిఫికేషన్ రిలాక్సేషన్ ఇచ్చి మెయిన్ సెంటర్లుగా మార్చాలని, గ్రాట్యూటీ అమలుకు గైడ్లైన్స్ రూపొందించాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలని, అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలుచేయాలని, హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడ్లైన్స్ రూపొందించి అమలుచెయ్యాలని, పెండింగ్లో ఉన్న సూపర్వైజర్ పోస్టులు వెంటనే భర్తీచేయాలని, మే నెల మొత్తం వేసవి సెలవులు ఇవ్వాలని, లబ్దిదారులకు ఆయిల్, కందిపప్పు క్వాంటిటి పెంచాలి. మెనూఛార్జీలు పెంచాలని, ఉచితంగా గ్యాస్ సరఫరా చెయ్యాలని, ప్రీ స్కూల్ను బలోపేతం చేసేందుకు ఈ క్రింది చర్యలు చేపట్టాలి 5 సం.లోపు పిల్లలందరూ అంగన్వాడీ సెంటర్లో ఉండాలని జీ.ఓ ఇవ్వాలి, ప్రీ స్కూల్ పిల్లలకు సాయంత్రం స్నాక్స్ ఇవ్వాలి, ప్రీ స్కూల్ పిల్లలకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వివి రాంప్రసాద్, చిల్లకల్లు ప్రాజెక్ట్ యూనియన్ కార్యదర్శి టి.మధుకుమారి, అధ్యక్షురాలు షేక్ అల్లాబీ, సువర్చల, రత్న కుమారి, లక్ష్మి, విశాలాక్షి, ఉమారాణి, మేరీ, జానమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆర్థిక స్థితిని పర్చడమే పి - 4లక్ష్యం: గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



గుడివాడ ఫిబ్రవరి 23:పేదల ఆర్థికస్థితిని మెరుగు పర్చడమే పి–4 కార్యక్రమ ప్రధాన లక్ష్యమని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. పి–4 కార్యక్రమంలో భాగంగా మూగ చెవిటి వాడైనా గుడివాడ బాపూజీ నగర్ కు చెందిన 8ఏళ్ల చిన్నారి మహమ్మద్ రసూల్ కు, ఎన్నారై వీర్నాల బాలాజీ దాతృత్వంతో సమకూర్చిన రూ.55 వేల విలువచేసే వినికిడి యంత్రాన్నీ ప్రజావేదిక కార్యాలయంలో చిన్నారికి సోమవారం ఎమ్మెల్యే రాము అందజేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ దార్శనికులు సీఎం చంద్రబాబు గారి ఆలోచనలో నుంచి పి–4 ఉద్భవించిందన్నారు. సంపద కలిగిన కుటుంబాలు అట్టడుగున ఉన్న కుటుంబాలకు అండగా నిలబడటమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. పేదల సాధికారత కోసం చేపడుతున్న ఈ కార్యక్రమంలో ఉన్నత కుటుంబాల వారంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. పేద కుటుంబాలను ఆదుకుంటున్న దాతలను ఎమ్మెల్యే రాము అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు
# తెలుగుదేశం పార్టీ మండల కమిటీ చేయూత
### బియ్యం నిత్యాసరాలు అందజేసిననాయకులు





వి.ఆర్.పురం,ఫిబ్రవరి 23(నేటి శుభోదయ ప్రతినిధి)అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ అండగావుండి చేయూత అందిస్తుందని,తెలుగుదేశం పార్టీ నాయకులు బొర్రా నరేష్ కుమార్,ముత్యాల రామారావు, బొర్రా నరసింహారావు,చెప్పారు. సోమవారం మొద్దులగూడెం,గ్రామంలో విద్యుత్తు సార్టుసర్క్యూట్ కారణంగా గ్రామానికి చెందిన సోడే శరత్ కుమార్,సోడే సరోజిని,ఇల్లు అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయాయి.

ఈప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితులకు సోమవారం తెలుగుదేశం పార్టీ, మండలకమిటీ "బృందం" ఆధ్వర్యంలో నిత్యాసరాలు బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా,నాయకులు మండల అధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్,తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు,బొర్రా నరసింహారావు, మాట్లాడుతూ ఘటన బాధాకరమని అన్నారు. విద్యుత్ సమస్య లోవోల్టేజి తోనే ఇలా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ప్రమాదం సంభవించిందని అన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు పవర్ ట్రాన్స్ఫారం ఏర్పాటుచేసేలా చూడాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు ముత్యాల సిద్ధార్థ,(సిద్దూ)మాజీ సొసైటీ ప్రెసిడెంట్ ముత్యాల చంద్రశేఖర్,సవలం రాజేంద్రప్రసాద్,బీరక సూర్య ప్రకాశరావు,పాయం రామారావు, కోట్ల శ్రీనివాస్,బింగి విష్ణుమూర్తి, గ్రామస్తులుబాధితులు పాల్గొన్నారు.

# చిత్త-శుద్ధితో పనులు

### - చిరకాలం గుర్తుండిపోయేలా విధులు
### - కూనవరం సర్పంచ్ఆధ్వర్యంలో గ్రావెల్ రోడ్లు ప్రారంభం
### - సర్పంచ్ హేమంత్ గాంధీ - పాల్గొన్నకూటమినాయకులు






వి.ఆర్.పురం,(కూనవరం)ఫిబ్రవరి23(నేటి శుభోదయ ప్రతినిధి) అభివృద్ధిలో తగ్గేదిలే! చిత్తశుద్ధితోపనులు చేయడం,చిరకాలం గుర్తుండిపోయేలా విధులు. పోలవరంజిల్లా కూనవరంమండలం" కూనవరం" "టేకులబోరు"గ్రామంలో,కూనవరం సర్పంచ్ మల్లంపల్లి హేమంత్ గాంధీ,ఆధ్వర్యంలో రంపచోడవరం నియోజకవర్గం శాసన సభ్యురాలు మిరియాలు శిరీషాదేవి భాస్కర్, ఆదేశానుసారం పంచాయతీ నిధులద్వారా కూనవరం,ఉదయ భాస్కర్ కాలనీ,టేకులబోరు నందు దాదాపు30,రోడ్లుపైచిలుకుపురవీధుల్లో గ్రావెల్ రోడ్లు పోపించడం జరుగుతుందని,సర్పంచ్ హేమంత్ గాంధీ,వివరించారు. సోమవారం,ఈసందర్భంగా!ఆయనమాట్లాడుతూ,కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్,సారధ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రోడ్లుఏవిధంగా మార్పు చెందాయి అనేది యావత్ ఆంధ్ర రాష్ట్రమంతా చూస్తుందని చెప్పారు. అదేవిధంగా కూనవరం పంచాయతీలో అనేకఅభివృద్ధి కార్యక్రమాలుగతంలో ఎన్నడు లేనివిధంగాజరిగాయనిసూచించారు. ఏపంచాయతీలో జరగని విధంగాకూనవరంపంచాయతీఅభివృద్ధిపనులు పరుగులు పెడుతున్నాయని వివరించారు. అభివృద్ధి అంటేనే కూటమి ప్రభుత్వమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్,అంటేనే విజన్ కి ప్రతిరూపంమని కొనియాడారు. ఈకార్యక్రమంలో భారతీయ జనతాపార్టీ నాయకులు నోముల రామారావు, జనసేన మండల ప్రెసిడెంట్ దాసరి నరేంద్ర కుమార్,వైస్ ప్రెసిడెంట్ బుడుగుల బద్రి, తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు చెలికాని ఉమామహేశ్వర రావు,నాగరాజు, జనసైనికులు శ్రీరామ్,అశోక్ సంతోష్,వెంకన్న,కాంట్రాక్టర్ కుసుమరాజుల సురేష్,షూఫీ తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలగిరి వెంకటేశ్వర స్వామి వారి నిత్యాన్నదాన పథకమునకు 25,116/- రూపాయలు విరాళం

ఎన్ టి ఆర్ జిల్లా, జగ్గయ్యపేట, ఫిబ్రవరి 23 (బేతురంగా, నేటి శుభోదయ) : జగ్గయ్యపేట మండలము తిరుమలగిరి గ్రామములో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానము నందు జరుగుచున్న నిత్యాన్నదాన పథకమునకు కోదాడ వాస్తవ్యులు శ్రీ చింతల లింగయ్య పద్మ దంపతుల కుమారుడు వినయ్ కుమార్ 25,116/- రూపాయలు విరాళముగా అందజేసియున్నారు. వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా సిబ్బంది శ్రీ స్వామి వారి ప్రసాదములు అందజేయుట జరిగినది అని ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి వారు తెలియజేసియున్నారు.



# పేద విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్యా ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ



నేటి శుభోదయ 23 ఫిబ్రవరి పల్నాడు జిల్లా బొల్లాపల్లి : విద్యార్థుల హక్కు చట్టం కింద పేద మధ్య తరగతి కుటుంబాలకు చెందిన చిన్నారులు ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని బొల్లాపల్లి మండల విద్యాశాఖ అధికారి జి చిన్నపరెడ్డి తెలియజేశారు . దీనికి సంబంధించి అన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25% సీట్లకు ఉచితంగా పేద విద్యార్థులకు ఇవ్వాలని సూచించారు . మార్చి నెల పదో తారీకు లోగా వార్డు సచివాలయంలో గాని మండల విద్యా కేంద్రంలోని మీ సేవ కేంద్రంలోని దరఖాస్తు చేసుకోవచ్చు. 25 శాతం ఉచిత సీట్లలో ఎస్సీలకు 10 శాతం ,ఎస్టిలకు 04 శాతం ,బీసీ మైనారిటీలకు 06 శాతం, అనాధలకు 05 శాతం రిజర్వేషన్ కల్పించినట్లు తెలియజేశారు. అర్హులైన వారు కుల ధ్రువీకరణ పత్రం ఆధార్ కార్డు రేషన్ కార్డు పాస్పోర్ట్ సైజ్ ఫోటో తో దరఖాస్తు చేసుకోవాల్సింది గా కోరార

# ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ ( సిఐటియు) ఆధ్వర్యంలో చిల్లకల్లు ఐసిడిఎస్ ఆఫీస్ ఎదురుగా రిలే నిరాహార దీక్షలు



ఎన్టీఆర్ జిల్లా, జగ్గయ్యపేట, ఫిబ్రవరి 23(బేతురంగా, నేటి శుభోదయం) :జగ్గయ్యపేట ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ ( సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని చిల్లకల్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదురుగా రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కమిటీ సభ్యులు బి.రాము, సిఐటియు జగ్గయ్యపేట మండల కార్యదర్శి షేక్ గౌస్ మియా మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ. 26000/-లు ఇవ్వాలని, పెండింగ్ లో ఉన్న 1810 మినీవర్కర్లకు క్వాలిఫికేషన్ రిలాక్సేషన్ ఇచ్చి మెయిన్ సెంటర్లుగా మార్చాలని, గ్రాట్యూటీ అమలుకు గైడ్లెన్స్ రూపొందించాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలని, అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలుచేయాలని, హెల్పర్ల ప్రమోషన్లకు నిర్ధిష్టమైన గైడ్లెన్స్ రూపొందించి అమలుచెయ్యాలని, పెండింగ్లో ఉన్న సూపర్వైజర్ పోస్టులు వెంటనే భర్తీచేయాలని, మే నెల మొత్తం వేసవి సెలవులు ఇవ్వాలని, లబ్ధిదారులకు ఆయిల్, కందిపప్పు క్వాంటిటి పెంచాలి. మెనూఛార్జీలు పెంచాలని, ఉచితంగా గ్యాస్ సరఫరాచెయ్యాలని, ప్రీ స్కూల్ను బలోపేతం చేసేందుకు ఈ క్రింది చర్యలు చేపట్టాలి 5 సం॥లోపు పిల్లలందరూ అంగన్వాడీ సెంటర్లో ఉండాలని జీ.ఓ ఇవ్వాలి, ప్రీ స్కూల్ పిల్లలకు సాయంత్రం స్నాక్స్ ఇవ్వాలి, ప్రీ స్కూల్ పిల్లలకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వివి రాంప్రసాద్, చిల్లకల్లు ప్రాజెక్ట్ యూనియన్ కార్యదర్శి టి.మధుకుమారి, అధ్యక్షురాలు షేక్ అల్లాబీ, సువర్చల, రత్న కుమారి, లక్ష్మి, విశాలాక్షి, ఉమారాణి, మేరీ, జానమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వాహిని కళాశాలలో నూతన సాంకేతికత & విఎల్ఎస్ఐ ట్రెండ్స్ పై అతిథి ఉపన్యాసం




విస్సన్నపేట : నేటి శుభోదయ (ప్రతినిధి కమలాకర్) : తిరువూరు నియోజకవర్గంలోని శ్రీ వాహిని కళాశాలలో ఈసీఈ విద్యార్థుల కోసం ప్రత్యేక అతిథి ఉపన్యాసం నిర్వహించబడింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ అష్రఫ్ అలీ, సిలిక్యాన్ టెక్నాలజీ(పీవీటి లిమిటెడ్) వ్యవస్థాపకులు హాజరయ్యారు. విఎల్ఎస్ఐ టెస్టింగ్ మరియు ఫిజికల్ డిజైన్లో ఆధునిక సాంకేతికతలు మరియు ట్రెండ్స్ యొక్క ప్రేరణ మరియు పరిధి (మోటివేషన్ అండ్ స్కోప్ అఫ్ అడ్వాన్స్ టెక్నాలజీస్ అండ్ ట్రెండ్స్ ఇన్ విఎల్ఎస్ఐ టెస్టింగ్ అండ్ ఫిసికల్ డిజైన్) అనే అంశంపై డా.అష్రఫ్ అలీ సమగ్రంగా ప్రేరణాత్మకంగా ఉపన్యసించారు. సెమీకండక్టర్ రంగంలో వెలుగులోకి వస్తున్న ఆధునిక సాంకేతిక పరిణామాలు ఈ రంగంలో ఉన్న విస్తృతమైన ఉద్యోగావకాశాలు అని ముఖ్యంగా టెస్టింగ్ మరియు ఫిజికల్ డిజైన్ విభాగాల్లో పెరుగుతున్న డిమాండ్ గురించి విద్యార్థులకు వివరణ ఇచ్చారు పోటీ ప్రపంచంలో ముందుండాలంటే బలమైన సాంకేతిక నైపుణ్యాలు సాధించి పరిశ్రమలోని తాజాగా ఆధునాతన ధోరణులను అనుసరించాలని చెబుతూ విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రంగా నాగేంద్రబాబు,ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ రెడ్డి శ్రీదేవి, అధ్యాపకులు మరియు విద్యార్థులు హాజరయ్యారు ఉపన్యాసం అత్యంత సమాచార ప్రధానంగాను పరస్పర చర్చలతో సాగి విద్యార్థులకు విలువైన మార్గదర్శకత్వాన్ని అందించింది. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం మరియు అధ్యాపక వర్గం డాక్టర్ అష్రఫ్ అలీకి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఇంటర్ పరీక్షలు ప్రారంభం.


నేటి శుభోదయ వెలుగోడు :నంద్యాల జిల్లా ప్రతినిధి : ఫిబ్రవరి 23 న్యూస్ వెలుగోడు పట్టణం లోని జూనియర్ కాలేజీ పరీక్ష సెంటర్ లో ఇంటర్ మీడియట్ పరీక్షలు సోమవారం ప్రారంభం అయ్యాయి. ఈ పరీక్ష సెంటర్ నందు ఎ. పి మోడల్ స్కూల్ , కస్తూరి భా పాఠశాల, జూనియర్ కాలేజీ కి చెందిన 266 మంది విద్యార్థులకు గాను , 250 మంది విద్యార్థులు హాజరు అయినట్లు ఎ. ఒ వెంకటరమణ తెలిపారు. మొదటి సంవత్సరశీ విద్యార్థులు మొదటి పరీక్ష కు 16 మంది గైర్హాజర్ అయినట్లు చెప్పారు. ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్ గా మురళి మోహన్, డిపార్ట్మెంట్ అధికారిగా శివ రామకృష్ణా చారి పర్యవేక్షణ లో పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు చెప్పారు.

## జనసేన పార్టీ సీనియర్ నాయకులు కొచ్చర్ల బాబి ఇంట శుభకార్యానికి హాజరైన 'రుడా' చైర్మన్ బొడ్డు వేంకట రమణ చౌదరి, శ్రీమతి బత్తుల వెంకటలక్ష్మి.. కూటమి నాయకులు...!









కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం కోరుకొండ లో జనసేన పార్టీ నాయకులు కొచ్చర్ల బాబీ ఇంట జరిగిన శుభకార్యానికి సోమవారం నియోజకవర్గానికి చెందిన కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరై ఆశీస్సులు అందజేశారు. బాబి ఆహ్వానం మేరకు వారి కుమార్తె కావ్య శ్రీ ఓణీల ఫంక్షన్ వేడుకలో జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు కమిటీ కో-ఆర్డినేటర్ శ్రీమతి బత్తుల వెంకటలక్ష్మి ప్రత్యేకంగా విచ్చేసి ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా బాబీ కుటుంబంతో కొంతసేపు ఆత్మీయంగా గడిపారు. అదేవిధంగా తూర్పుగోదావరి జిల్లా టిడిపి అధ్యక్షులు, రాజమహేంద్రవరం 'రుడా' చైర్మన్, రాజానగరం నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి విచ్చేసి కావ్య శ్రీ ని ఆశీర్వదించారు. కూటమి నాయకులను ఆత్మీయంగా పలకరించారు.

ఈ సందర్భంగా బత్తుల వెంకటలక్ష్మికి, బొడ్డు వెంకటరమణ చౌదరికి స్థానిక నాయకులు, కార్యకర్తలు సాదరంగా స్వాగతం పలికారులు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కంటే నాగ కేశవరావు, మేడిశెట్టి శివరాం, అడ్డాల శ్రీనివాస్, ఎర్రంశెట్టి పోలారావు, సర్పంచ్ కర్రీ లక్ష్మీ సరోజ, బదిరెడ్డి దొర, కర్రీ గణేష్, తాటికొండ బుజ్జి, కామిశెట్టి దొరబాబు, కోర్పు బుజ్జి, తెలగంశెట్టి శివ, మాతా ప్రభు, దాసెట్టి శ్రీనివాస్, పసుపులేటి శివ, వాతాడ గోపి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి

### -ఎన్. టి. ఆర్. జిల్లా కలెక్టర్ లక్ష్మీశా
### -వేస్ట్ పిక్కర్ల ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటు
### -దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ద్వారా తోపుడు బళ్ల పంపిణీ





విజయవాడ, ఫిబ్రవరి 23 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) అట్టడుగు వర్గాల అభ్యున్నతికి దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ద్వారా తోపుడు బళ్ళను పంపిణి చేయడం అభినందనీయమని ఎన్. టి. ఆర్. జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ. లక్ష్మీశా అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ చేతుల మీదుగా ఆరుగురు వేస్ట్ పిక్కర్లకు తోపుడు బళ్ల రిక్షాలు పంపిణీ చేసిన అనంతరం మాట్లాడుతూ లబ్దిదారులు తమ పిల్లలను బాగా చదివించుకుని, చిన్న వ్యాపారాలను ప్రారంభించి ఆర్థికంగా సామాజికంగా ఎదగాలని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని స్థిర నివాసలను ఏర్పరచుకోవాలని కోరారు. అవసరమైన సహాయం, మార్గదర్శకత ఎప్పటికప్పుడు అందిస్తామని హామీ ఇచ్చారు. సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఇటువంటి కార్యక్రమాలు దోహద పడతాయని అన్నారు. వేస్ట్ పిక్కర్ల ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడం, వారికి స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఈ సహాయాన్ని అందిస్తున్నట్లు రిసోర్స్ సెంటర్ జిల్లా కోఆర్డినేటర్ రమాదేవి తెలిపారు. ఈ వాహనాల ద్వారా వారు స్వతంత్రంగా తమ జీవనోపాధిని కొనసాగించగలరని, ఆదాయం పెంపొందించుకునే అవకాశాలు విస్తరించనున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి. రమేష్, అనిత, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.



## ముత్యపు పందిరి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి

పులిచెర్ల, ఫిబ్రవరి 23,(నేటి శుభోదయ) :చిత్తూరు జిల్లా, పులిచెర్ల మండలం, మంగళంపేట శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం స్వామి వారు ముత్యపు పందిరి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు స్వామి వారు ముత్యపు పందిరి వాహనంపై భక్తుల గోవిందా నామస్మరణతో పురవీధుల్లో విహరిస్తూ, భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే సోమవారం రాత్రి సింహ వాహనం పై స్వామివారు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు వాహన సేవలో పాల్గొని స్వామివారిని కనులారా తిలకించారు. వేద పండితులు శ్రీనివాస్ ఆచార్యులు ప్రధాన అర్చకులు శేషాద్రి ఆచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉభయ దారులుగా కుమ్మరపల్లి హరిజనవాడ కు చెందిన గుండ్లపల్లి వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు, బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళంపేట ఆధ్యాత్మిక శోభ నెలకొంది.

## వేసవి తాపం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు



నేటి శుభోదయ వెలుగోడు:నంద్యాల జిల్లా ప్రతినిధి :ఫిబ్రవరి 23 న్యూస్ : వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి వెలుగోడు పట్టణంలోని బస్టాండ్ నందు సోమవారము కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అక్బర్ షా ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. చలివేంద్రం ప్రారంభం సందర్భంగా మజ్జిగను పంపిణీ చేశారు. మినరల్ కూలింగ్ తాగునీటి క్యాన్లు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. చలివేంద్రాన్ని మూడు నెలల పాటు వేసవి కాలము పూర్తయ్యేవరకు కొనసాగిస్తానని అక్బర్ షా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హబీబ్ ఖాన్ కాజన్నగౌడు , వెంకటేశ్వర్లు , మహమ్మద్ రఫీ , సైకిల్ షాప్ మజీద్ తదితరులు పాల్గొన్నారు

## విస్సన్నపేట శ్రీనివాస డైరీ ఆధ్వర్యంలో వార్షికోత్సావ వేడుకలు

### తిరువూరులోని శ్రీ భగవాన్ రమణ మహర్షి ఆశ్రమం నందు వృద్దులకు నిత్యావసర సరుకుల పంపిణి





విస్సన్నపేట : నేటి శుభోదయ(ప్రతినిధి కమలాకర్): విస్సన్నపేట నడిబొడ్డున శ్రీ శ్రీనివాస పాల డైరీ ఆధ్వర్యంలో శ్రీనివాస పాల డైరీ ప్రారంభించి నేటికీ 7 వసంతాలు విజయవంతంగా ముగించుకొని 8 వ వార్షికోత్సవంలో అడుగుపెడుతున్న తరుణంలో డైరీ వ్యవస్థాపకులు శ్రీనివాసరావు వివిధ ప్రాంతాలలో తమ బ్రాంచ్ లను ఏర్పాటు చేసి నాణ్యతతో కూడిన స్వచ్ఛమైన పాలు పాల పదార్థాలు సరసమైన ధరలతో చుట్టుప్రక్కల ప్రజల మన్ననలు పొందుతూ అదే విధంగా అనేక సేవాకార్యక్రమాలు నిర్వహించటం వరిపాటిగా నిర్వహించే క్రమంలో శ్రీనివాస డైరీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా వృద్ధులకు రెండు నెలలకు సరిపడిన నిత్యావసర వస్తువులను వృద్ధుల అనాధ ఆశ్రమం నందు సుమారు 40 మందికి పైగా అందించటం జరిగింది ఈ సందర్భంగా శ్రీనివాస డైరీ వ్యవస్థాపకులు మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని మనిషిలోనే ప్రత్యక్షం దైవం ఉందని నమ్ముతా అని అందుకే ప్రతి సంవత్సరం ఇలాగే సేవా కార్యక్రమాలు చేయటం అంటే ఇష్టమని తెలియచేసారు అంతే కాకుండా పాల ఉత్పత్తి దారులైన రైతులను కూడా ప్రోత్సహిస్తూ ప్రతి సంవత్సరం పాడి రైతులకు బహుమతులు అందిస్తూ రైతులకు మంచి ధర అందిస్తున్న శ్రీనివాస పాలడైరీ దినదినాభివృద్ధి చెంది ఇంకా మరేందరికో తమ సేవలు అందించాలని శ్రేయోభిలాషులు కోరుకుంటున్నారు ఈ కార్యక్రమంలో డాక్టర్ కిరణ్ వీర్ల మరియు ఆశ్రమ నిర్వాహకులు మణి రత్నం తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎన్టీఆర్ జిల్లా కమిషనర్ ఆఫ్ పోలీస్ యస్ వీ రాజశేఖర బాబు ,దంపతులు



ఎన్టీఆర్ జిల్లా,పెనుగంచిప్రోలు ఫిబ్రవరి 23 (బేతురంగా, నేటిశుభోదయ) : పెనుగంచిప్రోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీ గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఎన్టీఆర్ జిల్లా కమిషనర్ ఆఫ్ పోలీస్ యస్ వీ రాజశేఖర బాబు (ఐపీఎస్) దంపతులు శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానముకి విచ్చేసి ఆలయం లో అమ్మవారికి పూజలు నిర్వహించి అనంతరం అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు వేద పండితులచే వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రములు తీర్థ ప్రసాదములు అందజేశారు

## సీసీ రోడ్డు శాంక్షన్ తాతయ్యకు కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు

ఎన్టీఆర్ జిల్లా, వత్సవాయి , ఫిబ్రవరి 23 (బేతురంగా, నేటిశుభోదయ) :వత్సవాయి మండలం ఆళ్ళూరుపాడు గ్రామంలో రాజ కాలనీలో ఎన్నోఏళ్లుగా ఇబ్బంది పడుతున్న కాలనీ వాసులకు శాశ్వత విముక్తి కలిగించిన కూటమి ప్రభుత్వం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాశీ రాజగోపాల్ తాతయ్య ,బడుగు బలహీన వర్గాలకు అండగా నిలబడి ఏన్నో సంవత్సరల నుండి వర్షం వస్తే కాలనీ వాసులు ఎటు పోలేని పరిస్థితుల్లో ఉన్న రహదారులను 350 మీటర్ల సీసీ రోడ్డుని శాంక్షన్ చేసి పనులు మొదలుపెట్టించారు బలహీనుల భలం అయినా తాతయ్య గారి దృష్టికి తీసుకెళ్తే వెంటనే వారి బాధను అర్ధం చేసుకొని సీసీ రోడ్ శాంక్షన్ చేయించి ఎన్నో సంవత్సరల ఇబ్బంది నుంచి విముక్తి కలిగించిన మా అభినవ అంబేద్కర్ తాతయ్య అని కాలనీ వాసులు దళితుల పిలుపు - తాతయ్య గెలుపు అంటూ మండల తెలుగుదేశం పార్టీ రాజ సెల్ అధ్యక్షులు కాకాని బాలకృష్ణ గ్రామవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు




# దోసకాయలపల్లి గ్రామానికి చెందిన జనసేన పార్టీ కార్యకర్త కొల్లి రమేష్ ఆకస్మిక మరణం

### - బాధితుడు కుటుంబానికి 1లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందజేసిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సతీమణి వెంకటలక్ష్మి..

కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం దోసకాయలపల్లి గ్రామానికి చెందిన జనసేన పార్టీ కార్యకర్త కొల్లి రమేష్ అకస్మాత్తుగా మరణించిన వార్త తీవ్ర గ్రామంలో తీవ్ర విషాదానికి గురి చేసింది. వారి కుటుంబాన్ని రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ ఆర్థిక సహకారంతో, వారి స్వంత నిధుల నుండి రూ. 1,00,000 - లను 'జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు' కమిటీ కో-ఆర్డినేటర్ శ్రీమతి బత్తుల వెంకటలక్ష్మి తండ్రిని కోల్పోయి నిరాధారులైన నలుగురు పిల్లలకు అందజేశారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని వెంకటలక్ష్మి భరోసాని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నాయకులు, రాజానగరం నియోజకవర్గ జనసేన పార్టీ దళిత నాయకులు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులు హెల్మెట్ ధరించండి

### - రోడ్డు ప్రమాదాలు నివారమే లక్ష్యం
### -జర్నలిస్టుల ఉచిత హెల్మెట్ పంపిణీ బ్రోచర్ ను ప్రారంభించిన జిల్లా ఎస్పీ జగదీష్
### - వచ్చేవారం జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులకు ఉచిత హెల్మెట్ పంపిణీ
### - మచ్చా రామలింగారెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్






అనంతపురం, నేటి శుభోదయ : అనంతపురం జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులందరూ హెల్మెట్ ధరించి రోడ్డు ప్రమాదాలు జరక్కుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క జర్నలిస్టు మీద ఉంది అని జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నివారించాలన్నదే జిల్లా పోలీస్ శాఖ లక్ష్యమని అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ అన్నారు. అనంతపురం జిల్లా అనంతపురం నగరంలోని ఎస్పీ కార్యాలయం నందు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ఏపీ జర్నలిస్టు డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టుల ఉచిత హెల్మెట్ పంపిణీ కార్యక్రమానికి సంబంధించి ప్రచార పోస్టర్ను జిల్లా ఎస్పీ పి జగదీష్, జిల్లాలోని ట్రైని ఐపీఎస్ అధికారి వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మచ్చ రామలింగారెడ్డి ప్రారంభించారు. జిల్లా పోలీస్ శాఖ తీసుకున్న నిర్ణయానికి మద్దతుగా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ హెల్మెట్ ధరించాలి రోడ్డు ప్రమాదాలు నివారించాలి అనే కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని ఇది అన్ని వర్గాలకు స్ఫూర్తినిస్తుందని వర్కింగ్ జర్నలిస్టులందరినీ అభినందిస్తున్నానని జిల్లా ఎస్పీ జగదీష్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పి జగదీష్ మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని వాటిని తగ్గించాలని లక్ష్యంతో నో హెల్మెట్ నో పెట్రోల్ అనే కార్యక్రమాన్ని తీసుకున్నామని ప్రజల నుంచి స్పందన బాగున్నదని అది ఇంకా కొనసాగిస్తామని కొంత పని ఒత్తిడితో కొంత నిదానంగా జరుగుతున్నదని ఎస్పీ జగదీష్ అన్నారు. జిల్లాలో సరాసరి రోజుకి 40 నుంచి 50 మంది హెల్మెట్ లేకుండా ఉండడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారని అది లేకుండా చూడాలన్నదే తమ ప్రయత్నమని ఎస్పీ జగదీష్ అన్నారు జిల్లాలోని ప్రజలు యువత అందరూ పోలీస్ శాఖకు సహకరించాలని అందరూ హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని అలా చేసినప్పుడే ప్రమాదాలు నివారించవచ్చునని అది ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని జిల్లా ఎస్పీ జగదీష్ అన్నారు. వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మచ్చ రామలింగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని విధంగా అనంతపురం జిల్లాలో జిల్లా పోలీస్ శాఖ జిల్లా ఎస్పీ జగదీష్ ప్రత్యేక చొరవ చూపి ఒక్కరు హెల్మెట్ ధరించాలి అని ప్రజల్ని చైతన్యవంతులు చేస్తున్న కార్యక్రమానికి వర్కింగ్ జర్నలిస్టుగా మద్దతు ఇవ్వాలనేటువంటి ఉద్దేశంతో మేము కూడా జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టు అందరికీ వచ్చేవారం ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ జగదీష్ ని వర్కింగ్ జర్నలిస్టులు యూనియన్ గా అభినందిస్తున్నామని ఈ కార్యక్రమానికి వర్కింగ్ జర్నలిస్టుగా తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో రాబోవు రోజుల్లో కొనసాగిస్తామని ఎక్కువ జిల్లాల్లో ఉచితంగా హెల్మెట్లు ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ పంపిణీ చేస్తుందని వచ్చేవారం అనంతపురం జిల్లా నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడతామని అనంతపురం నగరంలో జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేస్తామని మచ్చా రామలింగారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ నాయకులు షాకీర్, వెంకటేష్, రమణారెడ్డి, దాదు నాయక్ జానీ, త్యాగరాజ్ ,వెంకట్ , మురళి, ప్రసాద్ పెద్ద ఎత్తున నగరంలోని జర్నలిస్టులు పాల్గొన్నారు.

# బి. సి. సింహాగర్జన సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు


### - బి. సి. వై. పార్టీ యూత్ కన్వీనర్ బోయిన భిక్షు యాదవ్



గుడివాడ, ఫిబ్రవరి 23 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) బిజీవై పార్టీ అధినేత శ్రీ బోడే రామచంద్రయ్య సంకల్పించిన బీసీ సింహ గర్జన కార్యక్రమానికి గుడివాడ నుంచితరలి వచ్చి విజయవంతం చేసిన బీసీ సోదర సోదరీమణులకు బి. సి. వై పార్టీ యూత్ కన్వీనర్ బోయిన భిక్షు యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. బీసీలు సైనికులు వలే మారి ఈ బీసీ సింహ గర్జన విజయవంతానికి కృషిచేసిన బీసీ మహిళా అధ్యక్షురాలు కుంభం నాగమణి , కనకదుర్గ ,నెరుసు లక్ష్మీ రాజ్యం, పుట్టి వెంకటేశ్వరరావు తదితర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# 'ప్రజలు భయాందోళన చెందవద్దు..పరిస్థితిని జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది..'

### - ఫిర్యాదులకై హెల్ప్‌లైన్ నెంబర్ 9494060060 ను సంప్రదించవచ్చు.. - ఆక్యూట్ రీనాల్ ఫెయిల్యూర్ కేసులపై తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి



రాజమహేంద్రవరం, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె) : ఆక్యూట్ రీనాల్ ఫెయిల్యూర్ కేసులపై ప్రజలు భయాందోళన చెందవద్దని కలెక్టర్ కీర్తి చేకూరి విజ్ఞప్తి చేశారు. వై జంక్షన్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎస్పీ డి. నరసింహ కిషోర్, నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనాతో కలిసి సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చౌడేశ్వరినగర్, స్వరూప్‌నగర్ ప్రాంతాల్లో కిడ్నీ సంబంధిత కేసులు నమోదైన వెంటనే జిల్లా యంత్రాంగం అప్రమత్తమైందని తెలిపారు. జిల్లా పరిపాలన, వైద్య ఆరోగ్య, ఆహార భద్రత, పోలీసు, రెవెన్యూ, పశుసంవర్ధక శాఖలు మరియు మున్సిపల్ అధికారులు సమన్వయంతో తక్షణ చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక ప్రతిస్పందన బృందాల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహించి అవసరమైన వైద్యసేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. డయాలసిస్ అవసరమైన మూత్రపిండ సమస్యలతో ఇప్పటివరకు 12 మంది నగరంలోని వివిధ ఆస్పత్రుల్లో చేరగా, వీరందరికీ ఒకే పాలవ్యాపారి పాలు సరఫరా చేసినట్లు గుర్తించినట్లు తెలిపారు. వెంటనే అతనిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. అలాగే ఆ వ్యాపారి పాలు సరఫరా చేసిన 106 ఇళ్లలోని కుటుంబాలకు రక్తపరీక్షలు నిర్వహిస్తున్నామని, ఇప్పటివరకు 73 కుటుంబాల నుంచి రక్త నమూనాలు సేకరించినట్లు తెలిపారు. వీరందరికీ నిరంతర పర్యవేక్షణతో తగిన వైద్యసేవలు అందిస్తామని స్పష్టం చేశారు. పశుసంవర్ధక శాఖ ద్వారా 46 పశువులకు పరీక్షలు నిర్వహించి నమూనాలను వైజ్ఞానిక మరియు పశుసంవర్ధక శాఖ ప్రయోగశాలలకు పంపినట్లు తెలిపారు. ఆహార భద్రత అధికారులు సేకరించిన పాలు, పెరుగు తదితర పాల ఉత్పత్తులను హైదరాబాద్ మరియు విశాఖపట్నంలోని ప్రయోగశాలలకు పంపినట్లు వెల్లడించారు. నివేదికలు అందిన వెంటనే తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ అంశంపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా స్పందించి, ఆక్యూట్ రీనాల్ ఫెయిల్యూర్ కేసులపై సమగ్ర నివేదికను కోరినట్లు కలెక్టర్ తెలిపారు. బాధితులకు అత్యుత్తమ వైద్యసేవలు అందించడంతో పాటు, మూల కారణాలను త్వరితగతిన గుర్తించాలని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. ప్రజల్లో అపోహలు వ్యాపించకుండా సమగ్ర అవగాహన కల్పించాలని, అవసరమైన అన్ని వనరులు వినియోగించాలన్న దిశగా సూచనలు అందించినట్లు చెప్పారు. ప్రజలు భయాందోళన చెందవద్దని, అనుమానాస్పద లక్షణాలు కనిపించిన వెంటనే హెల్ప్‌లైన్ నెంబర్ 9494060060 ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. ఈ కేసులకు సంబంధించి హెల్త్ బుల్లెట్ ను అధికారికంగా విడుదల చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఎస్పీ డి. నరసింహ కిషోర్ మాట్లాడుతూ... ఇప్పటివరకు నాలుగు మరణాలు సంభవించినట్లు వెల్లడించారు. మృతులు ఎన్. శేషగిరిరావు (72), రాధాకృష్ణమూర్తి (74), తాడి కృష్ణవేణి (76), తాడి రమణి (58)గా తెలిపారు. ఈ మరణాలకు సంబంధించిన మృతదేహ పరీక్షా నివేదికలు రావాల్సి ఉన్నట్లు చెప్పారు. అనధికారికంగా నిర్వహిస్తున్న డెయిరీని సీజ్ చేసి పాలవ్యాపారిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. కారణాలు స్పష్టమైన వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటివరకు సేకరించిన రక్త నమూనాల ఆధారంగా చిన్నపిల్లలు, వృద్ధులే ఎక్కువగా ప్రభావితమైనట్లు గుర్తించినట్లు తెలిపారు. ప్రజలు కొన్ని రోజులు బాగా మరిగించిన పాలను మాత్రమే వినియోగించాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. వె. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... అనారోగ్యానికి గురైన వారిలో వికారంతో కూడిన వాంతులు, మూత్ర విసర్జన తగ్గడం వంటి లక్షణాలు కనిపించినట్లు తెలిపారు. ఆస్పత్రుల్లో చేరిన వారిలో ఎక్కువ మంది 60 ఏళ్లు పైబడిన వారేనని చెప్పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ఆదివారం రాత్రి నుంచి రక్త నమూనాల సేకరణ కొనసాగుతోందన్నారు.సమీక్ష సమావేశంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. పి.వి.వి. సత్యనారాయణ తదితర అధికారులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేద్దాం - శ్రీరాం రాజగోపాల్




ఎన్టీఆర్ జిల్లా, జగ్గయ్యపేట, ఫిబ్రవరి 23, (బేతురంగా,నేటిశుభోదయం) : జగ్గయ్యపేట పట్టణంలో డ్రగ్స్ నిర్మూలన దిశగా సమాజమంత కలిసికట్టుగా ముందుకు సాగాలని స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పిలుపు నిచ్చారు. డ్రగ్స్ పై అవగాహన కోసం ఐదుగురు మహిళా పోలీసు అధికారులు చేస్తున్న సైకిల్ యాత్ర జగ్గయ్యపేటకు చేరిన సందర్భంగా స్థానిక మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో ' డ్రగ్స్ పై దండయాత్ర ' సభను పోలీసు అధికారులు నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారి యువతను నిర్వీర్యం చేస్తున్న ఈ సమయంలో యావత్ సమాజం డ్రగ్స్ పై పోరాటానికి సంసిద్ధం కావాలన్నారు.కేడీసీసీ చైర్మన్ నెట్టెం రఘురామ్ డ్రగ్స్ యువత జీవితాన్ని ఛిద్రం చేస్తున్న ఈ తరుణంలో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు.ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా మాట్లాడుతూ యువత,విద్యార్థులు డ్రగ్స్ బారిన పడితే సమాజమే నాశనమై పోతుందని,యువత,విద్యార్థులు డ్రగ్స్ కు దూరంగా ఉండడం తోపాటు సమాజాన్ని చైతన్య వంతం చేయాలన్నారు.జిల్లా సీపీ రాజశేఖర్ బాబు మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా నేరాలను అరికట్టే సాంకేతికతలో చాలా ముందంజలో ఉందన్నారు.దీని సహాయంతో డ్రగ్స్ నిర్మూలనకు పోలీసులే కాకుండా సమాజమంతా సన్నద్ధం కావాలన్నారు.ఈగిల్ ఎస్పీ నాగేశ్వరరావు డ్రగ్స్ నిరోధానికి చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రజలంతా మద్దతుగా సహకరించాలన్నారు.డీసీపీ సరిత డ్రగ్స్ మనిషి జీవితాన్ని ఎలా ఛిద్రం చేస్తాయో వివరించారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర డ్రగ్స్ ను అరికడితేనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు.ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వరరావు,నర్కిల్ ఎస్సైలు రాజు,సూర్యశ్రీనివాస్,ఉమామహేశ్వరరావు,అర్జున్,తహశీల్దారు మనోహర్ తదితరులు పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.డ్రగ్స్ అనర్థాలపై చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.సైకిల్ యాత్రలో పాల్గొన్న ఐదుగురు మహిళా పోలీసు సిబ్బందిని అధికారులు సన్మానించారు.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .